PRGI Reg No -"APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి.....

శుభోదయ

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 78, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, శుక్రవారం - 08 - మే - 2026 , వెల రూ.5/-

## 'ఆపరేషన్ సిందూర్' దెబ్బ.. ఆర్థికంగా కుదేలైన పాకిస్థాన్

సైనిక చర్య 'ఆపరేషన్ సిందూర్'తో పాక్ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం




పెట్టుబడులు, పర్యాటకం, ఎగుమతుల రంగాలు కుదేలు

భారత్, బంగ్లాదేశ్ వైపు మళ్లుతున్న అంతర్జాతీయ ఆర్డర్లు

భారీగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం.. మందగించిన జీడీపీ వృద్ధి

## తమిళనాట రాజకీయ ఉత్కంఠ.. ఎమ్మెల్యేలతో విజయ్ కీలక భేటీ

తమిళనాట ప్రభుత్వ ఏర్పాటుపై కొనసాగుతున్న ఉత్కంఠ




టీవీకే ఎమ్మెల్యేలతో పనైయూర్‌లోని పార్టీ కార్యాలయంలో అధినేత విజయ్ సమావేశం

మెజారిటీకి 10 సీట్ల దూరంలో నిలిచిన టీవీకే పార్టీ

## కొత్త ప్రభుత్వానికి అడ్డుపడం.. ఆ వదంతులను నమ్మొద్దు: స్టాలిన్




ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామన్న డీఎంకే అధినేత

కొత్త ప్రభుత్వం ఏర్పడటానికి అడ్డుపడబోమని స్పష్టీకరణ

మరో ఎన్నిక లేదా రాజ్యాంగ సంక్షోభం కోరుకోవడం లేదన్న



## నెల్లూరులో మహానాడు పనులకు శ్రీకారం..

- చరిత్రలో నిలిచేలా నిర్వహిస్తామన్న నేతలు
- భూమి పూజలో పాల్గొన్న మంత్రులు, ఎంపీలు
- టీడీపీ చరిత్రలో తొలిసారిగా నెల్లూరులో మహానాడు నిర్వహణ
- మే 27 నుంచి 29 వరకు ఇఫ్కో సెజ్‌లో మూడు రోజుల వేడుక

నెల్లూరు: తెలుగుదేశం పార్టీ ప్రతి ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడు సన్నాహాలు నెల్లూరు జిల్లాలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మిగతా..2లో




## విధులకు గైర్హాజరు.. 51 మంది వైద్యులపై ఏపీ సర్కార్ వేటు

- ఏపీలో 51 మంది ప్రభుత్వ వైద్యులను శాశ్వతంగా తొలగించిన ప్రభుత్వం
- ఏళ్ల తరబడి విధులకు అనధికారికంగా గైర్హాజరు కావడమే కారణం
- తొలగించిన వారిలో 8 మంది అసోసియేట్, 41 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు
- మరో 33 మంది వైద్యులకు ఛార్జ్ మెమోలు జారీ చేశామన్న మంత్రి సత్యకుమార్

# సంపద సృష్టితోనే సంక్షేమం..

## కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

- ★ ప్రారంభమైన కలెక్టర్ల 7వ కాన్ఫరెన్స్
- ★ గత ప్రభుత్వం రూ.9.74 లక్షల కోట్ల అప్పులు మిగిల్చిందన్న సీఎం
- ★ సంపద సృష్టి, అభివృద్ధి, సంక్షేమం ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయన్న చంద్రబాబు
- ★ ఫిర్యాదులను వంద శాతం పరిష్కరించాలని అధికారులకు కీలక ఆదేశం
- ★ రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు కుదిరాయని వెల్లడి



అమరావతి: సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ సచివాలయంలో ప్రారంభమైంది. రాష్ట్ర పాలనలో కీలకమైన ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, మంత్రులు, జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సదస్సు ప్రారంభంలో 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు దక్కించుకున్నందుకు మిగతా..2లో





## కేటీఆర్ పై క్రిమినల్ కేసు నమోదు

- రైతు సంగ్రామ సదస్సు వేదికగా రాహుల్, రేవంత్ లపై కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు
- కేటీఆర్ వ్యాఖ్యలు అనుచితంగా ఉన్నాయంటూ కాంగ్రెస్ నేతల ఫిర్యాదు
- బీఎన్ఎస్ సెక్షన్లు 504, 505 కింద కేసు నమోదు చేసిన పోలీసులు

# కేరళలో ప్రధాని మోదీని అమిత్‌షాలను ఓడించాం

## మెట్రో ఫేజ్--2కు ఆమోదం తెలపండి

- ★ వాళ్లకు ఒక్క సీటే దక్కింది
- ★ ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వం భాగస్వామిగా ఉండాలి
- ★ ఎయిర్‌పోర్ట్--ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను ఫేజ్--3 కింద చేపట్టండి
- ★ ఇప్పటికే డీపీఆర్ సమర్పించామని వెల్లడి
- ★ కేంద్రమంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి



న్యూఢిల్లీ:తాజాగా జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో భాగంగా కేరళలో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను ఓడించామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం మధ్యాహ్నం ఢిల్లీకి వచ్చిన ఆయన విమానాశ్రయంలో విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు స్పందించారు. 'కేరళలో కాంగ్రెస్ విజయం సాధించింది. అక్కడ రాహుల్, ప్రియాంకా గాంధీ, మల్లికార్జున ఖర్గేలు నరేంద్ర మోదీ, మిగతా..2లో



## హైదరాబాద్‌లో 40 కి.మీ పొడవైన కొత్త మెట్రో కారిడార్‌కు ప్రణాళిక

- హైదరాబాద్‌లో మరో మెట్రో అద్భుతం.. భూమి లోపల, పైన, ఆకాశంలో ప్రయాణం!
- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి స్కిల్ యూనివర్సిటీ వరకు నిర్మాణం
- అండర్‌గ్రౌండ్, ఎలివేటెడ్, భూమిపై వెళ్లేలా వినూత్న డిజైన్
- ఈ మార్గాన్ని ఫేజ్-3లో చేపట్టాలని కేంద్రానికి సీఎం రేవంత్ విజ్ఞప్తి మిగతా..2లో

# రెండు తెలుగు రాష్ట్రాలకు 3 రోజుల పాటు వర్ష సూచన

## ఉరుములతో కూడిన వర్షాలు పడే అవకాశం

**ఉపరితల ద్రోణి..**

కొన్ని రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు

ద్రోణి ప్రభావంతో మూడు రోజుల పాటు వర్షాలు పడతాయని వెల్లడించిన వాతావరణ శాఖ



హైదరాబాద్/అమరావతి: తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగలతో అల్లాడుతున్న ప్రజలకు వాతావరణ శాఖ ఉపశమనాన్ని కలిగించే వార్త చెప్పింది. మిగతా..2లో

## తిరుమలకు ఆధ్యాత్మిక శోభ.. వీధులు, సర్కిళ్లకు కొత్త పేర్లు

- భక్తుల సౌకర్యార్థం రూ.కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆమోదం
- తిరుమల వీధులు, సర్కిళ్లకు ఆధ్యాత్మిక, పౌరాణిక పేర్లు ఖరారు
- నాలుగు మాడ వీధులకు నాలుగు వేదాల పేర్లతో నామకరణం
- ధూపదీప నైవేద్యాల సాయాన్ని రూ.5,000 నుంచి రూ.10,000కు పెంపు

**అలిపిరి వద్ద రూ.4.75 కోట్లతో శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం యాగశాల**

తిరుపతి: తిరుమల పురవీధులకు ఆధ్యాత్మిక, పౌరాణిక శోభను తీసుకువచ్చే దిశగా టీటీడీ పాలకమండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. క్షేత్రంలోని మాడ వీధులు, ప్రధాన సర్కిళ్లు, రహదారులకు చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాశస్త్యం ఉన్న మహనీయుల పేర్లను ఖరారు చేసింది. టీటీడీ నియమించిన కమిటీ సిఫార్సుల మేరకు ఈ కొత్త పేర్లకు పాలకమండలి సమావేశంలో ఆమోదముద్ర మిగతా..2లో



# తమిళనాట రాజకీయ థ్రిల్లర్..

## విజయ్ ప్రభుత్వ ఏర్పాటుపై గవర్నర్ బ్రేక్!

- ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్ ప్రతిపాదనను తిరస్కరించిన గవర్నర్
- తగినంత సంఖ్యాబలం లేదని గవర్నర్ ఆర్వీ అర్లేకర్ అసంతృప్తి
- ఫ్లోర్ టెస్ట్‌కు తాను సిద్ధమని గవర్నర్‌కు స్పష్టం చేసిన విజయ్
- మిత్రపక్షాల మద్దతుపై గవర్నర్‌కు అనుమానాలు, ప్రశ్నలు
- టీవీకే, అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు రిసార్టులకు తరలింపుతో పెరిగిన ఉత్కంఠ




తమిళనాడు : తమిళనాడు రాజకీయాలు తీవ్ర ఉత్కంఠ రేపుతున్నాయి. ఎన్నికల్లో అద్భుత విజయం సాధించిన నటుడు విజయ్ నేతృత్వంలోని మిగతా..2లో

## కొత్త ప్రభుత్వానికి అడ్డుపడం..
# ఆ వదంతులను నమ్మొద్దు: స్టాలిన్

తమిళనాడు: తమిళనాడులో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించి డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కొత్త పార్టీ అధికారంలోకి రావాలన్న ప్రజల తీర్పును తమ పార్టీ గౌరవిస్తుందని ఆయన స్పష్టం చేశారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు డీఎంకే ఏ విధంగానూ అడ్డుపడబోదని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మరోసారి ఎన్నికలు రావడం గానీ, రాజ్యాంగ సంక్షోభం తలెత్తడం గానీ తాము కోరుకోవడం లేదని స్టాలిన్ అన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగానే నడుచుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా అన్నాడీఎంకేతో కలిసి డీఎంకే ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు చర్చలు జరుపుతోందంటూ వస్తున్న వదంతులను ఆయన తీవ్రంగా ఖండించారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. ప్రజలు మార్పు కోరుకున్నారని, వారి అభీష్టాన్ని శిరసావహిస్తామని స్టాలిన్ పేర్కొనడంతో రాష్ట్ర రాజకీయాల్లో నెలకొన్న ఊహాగానాలకు తెరపడినట్లయింది.

## తమిళనాట రాజకీయ ఉత్కంఠ..
# ఎమ్మెల్యేలతో విజయ్ కీలక భేటీ

తమిళనాడు: తమిళనాడులో కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై రాజకీయ ఉత్కంఠ కొనసాగుతోంది. తొలి ఎన్నికల్లోనే అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీకి కొద్దిదూరంలో టీవీకే (తమిళగ వెట్రి కళగం) నిలిచిపోయింది. ఈ కీలక తరుణంలో పార్టీ అధ్యక్షుడు విజయ్ నేడు పనైయూర్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 234 స్థానాలకు గాను టీవీకే 108 సీట్లు గెలుచుకుని సంచలనం సృష్టించింది. దశాబ్దాలుగా తమిళ రాజకీయాలను శాసిస్తున్న డీఎంకే, అన్నాడీఎంకేల ఆధిపత్యానికి గండికొడుతూ విజయ్ పార్టీ చరిత్రాత్మక విజయం సాధించింది. అయినప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన 118 మేజిక్ ఫిగర్‌కు ఇంకా 10 సీట్ల దూరంలో ఉంది. దీంతో ఇతర పార్టీలు, స్వతంత్ర శాసనసభ్యుల మద్దతు కూడగట్టే ప్రయత్నాల్లో టీవీకే నిమగ్నమైంది. గత రెండు రోజులుగా తెరవెనుక మంతనాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలతో విజయ్ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. మారుతున్న రాజకీయ పరిణామాలు, ఇతర పార్టీలతో జరుపుతున్న చర్చల పురోగతి, ప్రభుత్వ ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై ఈ సమావేశంలో విజయ్ ప్రధానంగా చర్చించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ క్లిష్ట సమయంలో ఎమ్మెల్యేలందరూ ఐక్యంగా ఉండాలని, వారికి భరోసా కల్పించేందుకే విజయ్ ఈ సమావేశం నిర్వహిస్తున్నారని సమాచారం. ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియ, రాజ్యాంగపరమైన అంశాలపై కూడా ఆయన ఎమ్మెల్యేలకు వివరించనున్నారు. చర్చలు జరుగుతున్నందున అనవసరమైన బహిరంగ వ్యాఖ్యలు చేయవద్దని, పార్టీ నాయకత్వానికి అందుబాటులో ఉండాలని కూడా విజయ్ సూచించే అవకాశం ఉంది. సంఖ్యాబలంపై స్పష్టత రాకపోవడంతో ఈ వారంలో జరగాల్సిన ప్రమాణ స్వీకారోత్సవంపై నీలినీడలు కమ్ముకున్నాయి. రానున్న 48 గంటలు తమిళ రాజకీయాలకు అత్యంత కీలకమని, విజయ్ ప్రభుత్వ ఏర్పాటులో విజయం సాధిస్తారా? లేదా? ప్రత్యర్థి కూటములు ప్రత్యామ్నాయ వ్యూహాలు రచిస్తాయా? అనేవి తేలిపోతాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సమావేశం నేపథ్యంలో పనైయూర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద భారీగా కార్యకర్తలు చేరుకునే అవకాశం ఉండటంతో పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు.

## 'ఆపరేషన్ సిందూర్' దెబ్బ.. ఆర్థికంగా కుదేలైన పాకిస్థాన్

ఢిల్లీ: పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థను 'ఆపరేషన్ సిందూర్' తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. 2025 మే నెలలో చేపట్టిన ఈ చర్య కారణంగా పెట్టుబడులు, పర్యాటకం, విమానయానం, ఎగుమతుల రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని గ్రీస్‌కు చెందిన 'గ్రీస్ సిటీ టైమ్స్' అనే మీడియా సంస్థ తన నివేదికలో వెల్లడించింది. ఈ ఆపరేషన్ కారణంగా పాకిస్థాన్‌లో ద్రవ్యోల్బణం పెరిగి, ఆర్థిక వృద్ధి మందగించి, ఇప్పటికే బలహీనంగా ఉన్న ఆర్థిక పునాదులు మరింత క్షీణించాయని నివేదిక విశ్లేషించింది. అధిక అప్పులు, విదేశీ మారకద్రవ్య నిల్వల కొరత, అంతర్జాతీయ సహాయంపై ఆధారపడటం వంటి సమస్యలతో ఇప్పటికే సతమతమవుతున్న పాక్ ఆర్థిక వ్యవస్థపై 'ఆపరేషన్ సిందూర్' మరింత భారాన్ని మోపింది. గత మూడేళ్లుగా ఆ దేశ జీడీపీ వృద్ధి సగటున 3 శాతం వద్దే స్తబ్దుగా ఉందని, పారిశ్రామిక ప్రగతి మందగించిందని నివేదిక గుర్తుచేసింది. ఈ సైనిక చర్యతో దేశంలో అనిశ్చితి పెరిగి, పెట్టుబడిదారులు వెనక్కి తగ్గారు. దీంతో వారు 'వేచి చూసే ధోరణి' అవలంబించగా.. బీమా, రుణ వ్యయాలు పెరిగాయి. ఈ సైనిక చర్య ప్రత్యక్ష ప్రభావం పర్యాటక రంగంపై పడింది. అంతర్జాతీయ పర్యాటకులు తమ పర్యటనలను రద్దు చేసుకోవడంతో హోటళ్లు, రెస్టారెంట్లు, టూర్ ఆపరేటర్లు, పర్యాటకంపై ఆధారపడిన స్థానిక వర్గాలు తీవ్రంగా నష్టపోయాయి. మరోవైపు, విమానయాన రంగం కూడా తీవ్ర ఒడుదొడుకులను ఎదుర్కొంది. విమాన సర్వీసులకు అంతరాయం కలగడంతో ఎయిర్‌లైన్స్‌తో పాటు ఎగుమతిదారులు, దిగుమతిదారులు, ప్రయాణికులపై వ్యయభారం పెరిగింది. ముఖ్యంగా టెక్స్‌టైల్స్, ఫార్మాస్యూటికల్స్, త్వరగా పాడైపోయే వస్తువుల ఎగుమతులు ఆలస్యం కావడంతో వాణిజ్య రంగం దెబ్బతింది. ఈ పరిణామాల నేపథ్యంలో అంతర్జాతీయ కొనుగోలుదారులు పాకిస్థాన్‌కు బదులుగా బంగ్లాదేశ్, వియత్నాం, భారత్ వంటి దేశాల నుంచి వస్తువులను కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారని నివేదిక పేర్కొంది. 'ఆపరేషన్ సిందూర్' కారణంగా పాకిస్థాన్‌లో ద్రవ్యోల్బణం కూడా ప్రమాదకర స్థాయిలో పెరుగుతోంది. 2025లో 4.5 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం, 2026లో 7.2 శాతానికి, 2027 నాటికి 8.4 శాతానికి చేరుకుంటుందని ఈ నివేదిక అంచనా వేసింది. మొత్తంమీద, ఈ సైనిక చర్య పాకిస్థాన్‌కు కోలుకోలేని ఆర్థిక నష్టాన్ని మిగిల్చిందని స్పష్టమవుతోంది.

# కేటీఆర్ పై క్రిమినల్ కేసు నమోదు

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై వరంగల్‌లో క్రిమినల్ కేసులు నమోదు కావడం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఉత్కంఠ రేపుతోంది. హన్మకొండ 'రైతు సంగ్రామ సదస్సు' వేదికగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చట్టపరమైన చిక్కులకు దారితీశాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలను ఉద్దేశించి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు అనుచితంగా ఉన్నాయని కాంగ్రెస్ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి తదితరుల ఫిర్యాదు మేరకు సుబేదారి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కేటీఆర్‌పై బీఎన్ఎస్ (దీచీ) యాక్ట్‌లోని సెక్షన్ 504 (శాంతి భంగం కలిగించేలా ఉద్దేశపూర్వకంగా అవమానించడం), సెక్షన్ 505 (ప్రజా విద్వేషాన్ని ప్రేరేపించే ప్రకటనలు చేయడం) కింద కేసులు నమోదు చేశారు.

## విధులకు గైర్హాజరు.. 51 మంది వైద్యులపై ఏపీ సర్కార్ వేటు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏళ్ల తరబడి విధులకు అనధికారికంగా గైర్హాజరవుతున్న 51 మంది వైద్యులను సర్వీస్ నుంచి శాశ్వతంగా తొలగించింది. ఈ విషయాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోగులకు మెరుగైన సేవలు అందించే క్రమంలో ప్రభుత్వం ఈ కఠిన చర్యలు చేపట్టిందని ఆయన స్పష్టం చేశారు. డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోని వివిధ ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో పనిచేస్తున్న వారిపై ఈ చర్యలు తీసుకున్నారు. తొలగించిన వారిలో 8 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 41 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు ట్యూటర్లు ఉన్నారు. వీరిలో కొందరు ఆరు నుంచి ఏడు సంవత్సరాలుగా విధులకు రాకుండా, ప్రైవేటు పనుల్లో ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ (ప్రవర్తనా నియమాలు)-1964 ప్రకారం షోకాజ్ నోటీసులు జారీ చేసినప్పటికీ, వారి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వీరితో పాటు, ఏడాదిలోపు గైర్హాజరైన మరో 33 మంది వైద్యులకు ఛార్జ్ మెమోలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. వీరిలో 11 మంది ఇప్పటికే తిరిగి విధుల్లో చేరారని, మిగిలిన వారు నిర్దేశిత గడువులోగా హాజరుకాకపోతే వారిని కూడా తొలగిస్తామని హెచ్చరించారు. "విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించే ప్రసక్తే లేదు" అని మంత్రి సత్య కుమార్ స్పష్టం చేశారు.

## విజయ్ పార్టీకి అందుకే మద్దతిస్తున్నాం: కాంగ్రెస్

తమిళనాడు: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం, నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి మద్దతు ప్రకటించడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) నేత, ఎమ్మెల్యే ఎస్. రాజేశ్‌కుమార్ గురువారం స్పందించారు. కేవలం తమిళనాడు లౌకికవాద స్వరూపాన్ని కాపాడటం కోసం, రాష్ట్రంలో మతతత్వ శక్తులు బలపడకుండా నిలువరించడం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల తర్వాత మారుతున్న రాజకీయ సమీకరణాల మధ్య రాజేశ్‌కుమార్ ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. పదవుల కోసం కాంగ్రెస్ పార్టీ తన సిద్ధాంతాలను పక్కన పెట్టిందంటూ వస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. కొన్ని రాజకీయ శక్తులు ఉద్దేశపూర్వకంగా కాంగ్రెస్ నిర్ణయాన్ని ప్రజా తీర్పునకు విరుద్ధమైనదిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నాయని, కానీ తమిళనాడు విస్తృత ప్రయోజనాలు, సామాజిక సామరస్యాన్ని దృష్టిలో ఉంచుకునే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. "కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ లౌకిక వాదానికి, సామాజిక న్యాయానికి కట్టుబడి ఉంది. ప్రజాతీర్పును, రాష్ట్ర భవిష్యత్తును పరిగణనలోకి తీసుకునే మా నిర్ణయం ఉంది" అని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రకటనకు ముందు నుంచే తమకు పలు రాజకీయ ఆహ్వానాలు వచ్చాయని, అయినా మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా 'ఇండియా' కూటమిలోని లౌకిక శక్తులతోనే కలిసి నడిచామని రాజేష్‌కుమార్ గుర్తుచేశారు. గత ఎన్నికల్లో లౌకిక ప్రగతిశీల కూటమి విజయానికి కాంగ్రెస్ కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేశారని, ఆరెస్సెస్, మతతత్వ శక్తులకు తమ పార్టీ సైద్ధాంతికంగా ఎప్పటికీ వ్యతిరేకమేనని పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా టీవీకే రాజకీయ వైఖరిని కూడా ఆయన ప్రస్తావించారు. విజయ్ నేతృత్వంలోని పార్టీ తమను తాము ఒక లౌకిక ఉద్యమంగా అభివర్ణించుకుందని గుర్తుచేశారు. టీవీకే అధినేత విజయ్, మాజీ ముఖ్యమంత్రి కె. కామరాజ్‌ను తన సైద్ధాంతిక స్ఫూర్తిగా బహిరంగంగా ప్రకటించారని, సామాజిక న్యాయ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటానని ప్రతిజ్ఞ చేశారని రాజేష్ కుమార్ తెలిపారు. "కామరాజర్ ఆదర్శాలను అంగీకరించి, లౌకిక, సామాజిక న్యాయ విలువలకు కట్టుబడిన రాజకీయ ఉద్యమానికి మద్దతివ్వడం ద్వారా తమిళనాడు లౌకిక పునాదులు మరింత బలపడతాయి" అని ఆయన అభిప్రాయపడ్డారు. తమిళనాడులో లౌకిక రాజకీయ శక్తుల ఐక్యతను కాపాడటం, మతతత్వ శక్తులకు ఏమాత్రం రాజకీయ అవకాశం దక్కకుండా చూడటమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన నొక్కిచెప్పారు. టీవీకేకు ఇచ్చిన మద్దతును ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో చూడాలి తప్ప, రాజకీయ అవకాశవాదంగా చూడకూడదని హితవు పలికారు. మతతత్వానికి వ్యతిరేకంగా, సామాజిక న్యాయం కోసం తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# సంపద సృష్టితోనే సంక్షేమం..

మొదటి పేజి తరువాయి

ముఖ్యమంత్రికి మంత్రులు, అధికారులు స్టాండింగ్ ఓవేషన్‌తో ఘనంగా అభినందనలు తెలిపారు. ఇది తన ఒక్కడి విజయం కాదని, గ్రామ స్థాయి అధికారి నుంచి మంత్రుల వరకు అందరి సమష్టి కృషి ఫలితమని సీఎం పేర్కొన్నారు.

గత పాలనలో రాష్ట్రం విధ్వంసం.. రూ.9.74 లక్షల కోట్ల అప్పులు మిగిల్చారు

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు స్వాగతోపన్యాసం చేస్తూ, రాష్ట్ర పరిపాలనపై తన దార్శనికతను, ప్రభుత్వ ప్రాధాన్యతలను స్పష్టం చేశారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా తీవ్రంగా దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. "గత పాలకుల నుంచి రూ.9.74 లక్షల కోట్ల అప్పులు మనకు సంక్రమించాయి. అంతేకాకుండా, 94 కేంద్ర పథకాల నుంచి సుమారు రూ.10 వేల కోట్లను గత ప్రభుత్వం దారి మళ్లించింది. చెల్లించాల్సిన బిల్లులు రూ.1.30 లక్షల కోట్లు కూడా మనపైనే రుద్దారు. రాష్ట్రంలోని రోడ్లన్నీ గుంతలు పడి విధ్వంసమయ్యాయి" అని చంద్రబాబు వివరించారు.

సంపద సృష్టితోనే సంక్షేమం.. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలి

ప్రస్తుతం తమ ప్రభుత్వం అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా పాలన సాగిస్తోందని ఆయన అన్నారు. "సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి అనేవి ఒకదానికొకటి ముడిపడిన చక్రం లాంటివి. అభివృద్ధి లేకుండా సంపద రాదు, సంపద లేకుండా సంక్షేమం సాధ్యం కాదు. డబ్బులు లేవని కూర్చోవడం కాదు, సంపదను సృష్టించే పని చేయాలి, చేద్దాం" అని అధికారులకు పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రభుత్వం విజయవంతమవుతుందని స్పష్టం చేశారు.

జవాబుదారీతనం అత్యంత ముఖ్యం

పరిపాలనలో జవాబుదారీతనం అత్యంత ముఖ్యమని చంద్రబాబు ఉద్ఘాటించారు. "ప్రజల నుంచి వచ్చే ఆర్థికేతర ఫిర్యాదులను 100 శాతం పరిష్కరించాల్సిందే. కొందరు అధికారులు వాటిని పైకి కిందకు తిప్పుతున్నారు, ఈ వైఖరి మారాలి. ఆర్థికపరమైన ఫిర్యాదులపైనా విచారణ జరిపి, అర్హమైన వాటిని వెంటనే పరిష్కరించాలి. 2027 మార్చి నాటికి రెవెన్యూ రికార్డులను పూర్తిగా ప్రక్షాళన చేయాలి" అని అధికారులకు గడువు విధించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంలో ప్రభుత్వం సాధిస్తున్న ప్రగతిని సీఎం వివరించారు. "నా కాలేజీ రోజుల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్ డ్రైవ్ చేయడం గర్వంగా భావించేవాళ్లం. అలాంటి దిగ్గజ సంస్థను ఇప్పుడు ఏపీకి తీసుకువచ్చాం. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి ప్రపంచ స్థాయి కంపెనీలు మన రాష్ట్రానికి వచ్చాయి. రూ.23 లక్షల కోట్ల విలువైన ఎంవోయూలు కుదుర్చుకున్నాం. ఇవి సాకారమైతే 24 లక్షల ఉద్యోగాలు వస్తాయి" అని చంద్రబాబు తెలిపారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్‌తో పాటు డేటా, ఏఐ, క్వాంటం టెక్నాలజీలకు ఏపీ కేంద్రంగా మారనుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మంత్రుల సింగపూర్ పర్యటన వివరాలు, స్వర్ణాంధ్ర విజన్ 2047, విద్య-వైద్యం వంటి అంశాలపై కూడా ఈ సదస్సులో సమీక్షించనున్నారు.

# కేరళలో ప్రధాని మోదీని అమిత్‌షాలను ఓడించాం

మొదటి పేజి తరువాయి

మల్లికార్జున ఖర్గేలు నరేంద్ర మోదీ, అమిత్‌షాలను ఓడించారు. వాళ్లకు అక్కడ ఒక్క స్థానం మాత్రమే దక్కింది. అదీ వాళ్ల పనితీరు..'అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

మెట్రో ఫేజ్--2కు ఆమోదం తెలపండి

హైదరాబాద్ మెట్రో ఫేజ్--2కు ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఏడు కారిడార్లతో కూడిన మెట్రో ఫేజ్--2 సమగ్ర ప్రణాళికను రూపొందించి ఇప్పటికే డీపీఆర్‌ను సమర్పించినట్లు తెలిపారు. ఢిల్లీలో కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సీఎం సమావేశమయ్యారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్--2, ఫేజ్--3పై చర్చించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ లో ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రోను విస్తరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఫేజ్--2, ఫేజ్--3 విస్తరణ సజావుగా సాగాలనే ఉద్దేశంతో మెట్రో ఫేజ్--1ను ఎల్అండ్‌టీ ఎంఆర్‌హెచ్ఎల్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని వివరించారు. ఈ నేపథ్యంలో ఫేజ్--2ను భారత ప్రభుత్వం -- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా చేపట్టేందుకు త్వరగా ఆమోదం తెలపాలని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

అలాగే హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ -- భారత్ ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను మెట్రో ఫేజ్--3గా చేపట్టాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. దీనికి సంబంధించిన డీపీఆర్‌ను కూడా ఇప్పటికే సమర్పించామని తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కె.శ్రీనివాస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్‌రెడ్డి, హెచ్ఎంఆర్ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా) ఎన్వీఎస్ రెడ్డి, ఢిల్లీ తెలంగాణ భవన్ ప్రత్యేకాధికారి సంజయ్‌కుమార్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరులో మహానాడు
# పనులకు శ్రీకారం..

నెల్లూరు: తెలుగుదేశం పార్టీ ప్రతి ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడు సన్నాహాలు నెల్లూరు జిల్లాలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితర ముఖ్య నేతలు నిన్న భూమి పూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత మహానాడును నెల్లూరులో నిర్వహించడం ఇదే తొలిసారి కావడంతో దీన్ని అత్యంత వైభవంగా నిర్వహించాలని జిల్లా నాయకత్వం సంకల్పించింది. నెల్లూరు నగర సమీపంలోని కొడవలూరు మండలం, ఇఫ్కో కిసాన్ సెజ్ ప్రాంగణంలో ఈ మహానాడును నిర్వహించనున్నారు. పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని మే 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. నెల్లూరులో జరగబోయే మహానాడు టీడీపీ చరిత్రలో ఒక తీపి గుర్తుగా నిలిచిపోయేలా విజయవంతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సుమారు 2200 ఎకరాల విశాలమైన ప్రాంగణంలో నిర్వహిస్తుండటంతో లక్షలాదిగా తరలివచ్చే కార్యకర్తల వాహనాల పార్కింగ్‌కు, ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. మొదటి రెండు రోజులు సుమారు 25 వేల మంది ప్రతినిధులు, చివరి రోజు బహిరంగ సభకు 7 లక్షలకు పైగా కార్యకర్తలు హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు నేతలు వివరించారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, పాశిం సునీల్ కుమార్, కాకర్ల సురేష్, కురుగుండ్ల రామకృష్ణ, కావ్యా కృష్ణారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు బీద రవిచంద్ర, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తమిళనాట రాజకీయ థ్రిల్లర్..

మొదటి పేజి తరువాయి

విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలంపై సస్పెన్స్ కొనసాగుతోంది. మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని విజయ్ చేస్తున్న వాదనతో గవర్నర్ ఆర్వీ అర్లేకర్ ఇంకా సంతృప్తి చెందలేదు. దీంతో ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియలో ప్రతిష్టంభన నెలకొంది. గురువారం ఉదయం రాజ్‌భవన్‌కు విజయ్‌ను పిలిపించిన గవర్నర్ అర్లేకర్, ఆయన ముందు పలు కీలక ప్రశ్నలు ఉంచారు. అసెంబ్లీలో మెజారిటీకి 118 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం కాగా, కేవలం 108 మంది సభ్యులున్న టీవీకే ఎలా ప్రభుత్వాన్ని నడుపుతుందని గవర్నర్ ప్రశ్నించినట్లు సమాచారం. ఏయే పార్టీలు మీకు మద్దతు ఇస్తున్నాయో స్పష్టం చేయాలని కోరారు. బుధవారం కూడా విజయ్‌తో భేటీ అయిన గవర్నర్, ఆయన ప్రతిపాదనను తిరస్కరించిన విషయం తెలిసిందే.

చిక్కుముడిగా మారిన సమీకరణాలు

తమిళనాడు అసెంబ్లీలో టీవీకేకు 108 సీట్లు ఉన్నాయి. మెజారిటీ మార్కును అందుకోవాలంటే మరో 10 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. కాంగ్రెస్ పార్టీకి ఉన్న 5 సీట్లతో పాటు, లెఫ్ట్ పార్టీల 4 సీట్లు, వీసీకే (2 సీట్లు), పీఎంకే (4 సీట్లు) వంటి చిన్న పార్టీల మద్దతుతో సులభంగా గట్టెక్కవచ్చని విజయ్ భావిస్తున్నారు. ఈ కూటమితో కలిపి మొత్తం బలం 123కి చేరుతుంది. తాను రెండు చోట్ల గెలవడంతో ఒక స్థానానికి రాజీనామా చేస్తే బలం 122 అవుతుంది. ఫ్లోర్ టెస్ట్‌కు తాను సిద్ధమని విజయ్ గవర్నర్‌కు చెప్పినట్లు ఎన్డీటీవీ వర్గాలు తెలిపాయి. అయితే, ఈ కూటమి ఏర్పాటు అంత సులభంగా కనిపించడం లేదు. వీసీకే పార్టీ, విజయ్ రాజకీయ ప్రత్యర్థిగా భావించే డీఎంకే కూటమిలో ఉంది. అలాగే పీఎంకే, విజయ్ సైద్ధాంతిక శత్రువైన బీజేపీతో పొత్తులో ఉంది. ఈ రెండు పార్టీలు తమ ప్రస్తుత కూటముల నుంచి బయటకు వస్తేనే విజయ్‌కు మద్దతు ఇవ్వగలవు. బీజేపీ వంటి మతతత్వ శక్తులతో ఎలాంటి సంబంధం పెట్టుకోకూడదనే షరతుతో కాంగ్రెస్ మద్దతు ఇస్తామని ప్రకటించింది. ఈ క్లిష్టమైన సమీకరణాల వల్లే గవర్నర్ సంతృప్తి చెందడం లేదని తెలుస్తోంది.

తెరపైకి అన్నాడీఎంకే.. రిసార్ట్ రాజకీయాలు

మరోవైపు అన్నాడీఎంకేతో టీవీకే పొత్తు పెట్టుకుంటుందనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో విజయ్ డీఎంకే, బీజేపీలను లక్ష్యంగా చేసుకున్నారు కానీ, అన్నాడీఎంకేపై పెద్దగా విమర్శలు చేయలేదు. దీంతో ఆ పార్టీలోని ఒక వర్గం విజయ్‌కు మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సుమారు డజనుకు పైగా అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు పుదుచ్చేరిలోని ఓ రిసార్టుకు తరలివెళ్లినట్లు వార్తలు వచ్చాయి. అయితే, ఈ వార్తలను అన్నాడీఎంకే సీనియర్ నేతలు సీవీ షణ్ముగం, కేపీ మునుస్వామి ఖండించారు. విజయ్‌తో పొత్తు ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

ఏ కూటమీ కొలిక్కి రాకపోతే, కొత్తగా ఎన్నికైన అసెంబ్లీని సస్పెండ్ చేసి రాష్ట్రపతి పాలన విధించాలని గవర్నర్ సిఫార్సు చేసే ప్రమాదం కూడా ఉంది. అదే జరిగితే తమిళనాడులో మళ్లీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ రాజకీయ అనిశ్చితి నేపథ్యంలో విజయ్ తన పార్టీకి చెందిన 107 మంది ఎమ్మెల్యేలను చెన్నైకి సమీపంలోని మామల్లపురం రిసార్టుకు తరలించారు. రాజకీయాల్లో కొత్త అయినప్పటికీ, విజయ్ ఎంతో అనుభవంతో నిబంధనలకు అనుగుణంగానే పావులు కదుపుతున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు.

# రెండు తెలుగు రాష్ట్రాలకు 3 రోజుల పాటు వర్ష సూచన

మొదటి పేజి తరువాయి

కర్ణాటక నుండి రాయలసీమ, తెలంగాణ మీదుగా ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు రెండు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ వాతావరణ మార్పుల వల్ల గత కొన్ని రోజులుగా నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గి, వాతావరణం చల్లబడే అవకాశం ఉంది. తెలంగాణ విషయానికి వస్తే... జోగులాంబ గద్వాల, ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ, మెదక్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అకాల వర్షాల నేపథ్యంలో ఉరుములు సంభవించే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయట తిరగవద్దని అధికారులు సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. తీర ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు పడవచ్చని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ముఖ్యంగా రైతులు తమ కోతకు వచ్చిన పంటలను కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు కోరారు.

# తిరుమలకు ఆధ్యాత్మిక శోభ.. వీధులు, సర్కిళ్లకు కొత్త పేర్లు

మొదటి పేజి తరువాయి

సమావేశంలో ఆమోదముద్ర వేసింది. దీంతో త్వరలోనే ఈ పేర్లు అధికారికంగా అమల్లోకి రానున్నాయి.ప్రధానంగా శ్రీవారి ఆలయం చుట్టూ ఉండే నాలుగు మాడ వీధులకు వేదాల పేర్లతో నామకరణం చేశారు. తూర్పు మాడ వీధిని 'రుగ్వేద మార్గం'గా, దక్షిణ మాడ వీధిని 'యజుర్వేద మార్గం'గా, పశ్చిమ మాడ వీధిని 'సామవేద మార్గం'గా, ఉత్తర మాడ వీధిని 'అధర్వణవేద మార్గం'గా పిలవనున్నారు. వీటితో పాటు శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశానికి 'భగవద్రామానుజాచార్య ప్రాంగణం' అని, బేడీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంతానికి 'సాళువ నరసింహరాయల ప్రాంగణం' అని పేర్లు పెట్టారు. అలాగే, తిరుమలలోని ప్రధాన కూడళ్ల పేర్లను కూడా మార్చారు. లేపాక్షి సర్కిల్‌కు 'అన్నమయ్య కూడలి', రామ్‌బగీచ సర్కిల్‌కు 'తొండమాన్ చక్రవర్తి కూడలి', ఎస్ఎంసీ సర్కిల్‌కు 'పురందరదాసు కూడలి'గా నామకరణం చేశారు. ఔటర్ రింగ్‌రోడ్డుకు 'తిరువేంకటపథం', ఇన్నర్ రింగ్‌రోడ్డుకు 'అన్నమాచార్య మార్గం' అని పేర్లు ఖరారు చేశారు. రామ్‌బగీచ నుంచి పుష్కరిణి వరకు ఉన్న మార్గానికి 'శ్రీ కృష్ణదేవరాయల మార్గం' అని పేరు పెట్టారు.

పలు అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్

ఈ సమావేశంలో పేర్ల మార్పుతో పాటు పలు అభివృద్ధి, సంక్షేమ నిర్ణయాలకు కూడా పాలకమండలి ఆమోదం తెలిపింది. భక్తుల సౌకర్యార్థం ఆళ్వార్ ట్యాంక్ నుంచి బాట గంగమ్మ సర్కిల్ వరకు ఉన్న సర్వదర్శనం క్యూలైన్లలో రూ.4.55 కోట్లతో అదనపు మరుగుదొడ్లు నిర్మించనున్నారు. వరాహస్వామి విశ్రాంతి భవనం-1లో రూ.3.61 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆలయాలకు అందిస్తున్న ధూపదీప నైవేద్యాల ఆర్థిక సాయాన్ని రూ.5,000 నుంచి రూ.10,000కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అలిపిరి వద్ద శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం కోసం రూ.4.75 కోట్ల వ్యయంతో ప్రత్యేక యాగశాల నిర్మించేందుకు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ నిర్ణయాలు తిరుమల ఆధ్యాత్మిక వైభవాన్ని పెంచడంతో పాటు భక్తులకు మెరుగైన వసతులు కల్పించనున్నాయి.

## హైదరాబాద్‌లో రూ.85 వేల కోట్ల విలువైన భూములు కాపాడాం: హైడ్రా కమిషనర్

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో కబ్జాల నుంచి సుమారు రూ.85 వేల కోట్ల విలువైన భూములను కాపాడామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. ప్రస్తుతం హైడ్రా పరిధిలో రూ.10 లక్షల కోట్ల విలువ చేసే భూములు కబ్జాకు గురైనట్లు తమకు సమాచారం ఉందని ఆయన తెలిపారు. ఆయన ఈరోజు మిర్యాలగూడలో పర్యటించి, వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హైడ్రాను తెలంగాణవ్యాప్తంగా విస్తరిస్తామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. హైదరాబాద్‌లో హైడ్రా కార్యకలాపాలకు ప్రజలంతా ఆకర్షితులయ్యారని, అందుకే రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా కావాలని ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తుతున్నాయని అన్నారు. కబ్జాలపై హైడ్రాకు వేలాదిగా ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన తెలిపారు. ఆయా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా తాము చర్యలు చేపడుతున్నామని అన్నారు. అందుకే నాలుగు వారాల పాటు ప్రజావాణిని నిలిపివేసినట్లు తెలిపారు. ఇప్పుడున్న దరఖాస్తుల పరిష్కారం కోసమే ప్రజావాణిని రద్దు చేశామని స్పష్టం చేశారు. హైడ్రాకు వ్యతిరేకంగా కొంతమంది కోర్టులను ఆశ్రయిస్తున్నట్లు చెప్పారు.

## 'ఆపరేషన్ సిందూర్' ప్రపంచానికి ఒక స్పష్టమైన సందేశం పంపింది: ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి: ఆపరేషన్ సిందూర్‌కు ఏడాది పూర్తయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. మన గడ్డపై దాడులను దేశం సహించబోదని, మన పౌరులకు ఎలాంటి హాని జరిగినా చూస్తూ ఊరుకోబోమని ఆపరేషన్ సిందూర్ ప్రపంచానికి స్పష్టమైన సందేశం పంపిందని ఆయన అన్నారు. (మే 7) ఆపరేషన్ సిందూర్ తొలి వార్షికోత్సవం సందర్భంగా 'ఎక్స్' వేదికగా చంద్రబాబు స్పందించారు. పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు. ఉగ్రవాదులకు గట్టి గుణపాఠం చెప్పిన భారత సాయుధ దళాలను ఆయన అభినందించారు. దేశ రక్షణలో భారత సామర్థ్యాలను ఈ ఆపరేషన్ చాటిచెప్పిందని పేర్కొన్నారు. రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ స్పందిస్తూ, దేశాన్ని రక్షించడంలో భద్రతా దళాలు చూపిన ధైర్యసాహసాలకు, అచంచలమైన నిబద్ధతకు వందనాలు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ జాతీయ గర్వానికి, న్యాయానికి, దృఢ సంకల్పానికి ప్రతీక అని ఆయన అన్నారు. మంత్రి నారా లోకేశ్ సైతం 'ఎక్స్'లో స్పందిస్తూ, భారత సార్వభౌమత్వాన్ని కాపాడటంలో దేశం యొక్క దృఢ సంకల్పాన్ని ఈ ఆపరేషన్ ప్రదర్శించిందని అన్నారు. ఈ కీలక సమయంలో ప్రధాని మోదీ నాయకత్వ పటిమను ఆయన కొనియాడారు.

## హైదరాబాద్‌లో 40 కి.మీ పొడవైన
# కొత్త మెట్రో కారిడార్‌కు ప్రణాళిక

హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మరో భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఫ్యూచర్‌సిటీలోని స్కిల్ యూనివర్సిటీ వరకు 40 కిలోమీటర్ల పొడవైన కొత్త కారిడార్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించాలని నిర్ణయించింది. ఈ మార్గాన్ని మూడో దశ కింద చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల కేంద్రానికి విజ్ఞప్తి చేయడంతో ఈ ప్రాజెక్టుపై ఆసక్తి పెరిగింది. ఈ కారిడార్ నిర్మాణం ప్రత్యేకంగా ఉండనుంది. ప్రయాణ సమయాన్ని 40 నిమిషాలకు పరిమితం చేసేలా భూమి లోపల (అండర్‌గ్రౌండ్), పిల్లర్లపై (ఎలివేటెడ్), నేలపై (ఎట్-గ్రేడ్) వెళ్లేలా మిశ్రమ పద్ధతిలో డిజైన్ చేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ నుంచి కార్గో వరకు 2 కిలోమీటర్లు అండర్‌గ్రౌండ్‌లో, ఆ తర్వాత మన్సాన్‌పల్లి, పెద్ద గోల్కొండ, రావిర్యాల ఎగ్జిట్‌ల మీదుగా 20 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ మార్గంలో మెట్రో ప్రయాణిస్తుంది. ఈ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన అంశం, రావిర్యాల ఎగ్జిట్ నుంచి స్కిల్ యూనివర్సిటీ వరకు 18 కిలోమీటర్ల దూరం భూమిపైనే రైలు పరుగులు పెట్టనుంది. ఇందుకోసం హెచ్ఎండీఏ నిర్మించనున్న 100 మీటర్ల వెడల్పు గల గ్రీన్‌ఫీల్డ్ రహదారి మధ్యలో 22 మీటర్ల స్థలాన్ని మెట్రోకు కేటాయించారు. ఈ మార్గంలో మొత్తం 16 స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. వాస్తవానికి, మెట్రో రెండో దశలోని ఐదు కారిడార్ల డీపీఆర్‌ను హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ (నూామీ) నాలుగు నెలల క్రితమే కేంద్ర ప్రభుత్వానికి పంపింది. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా ఈ ఎయిర్‌పోర్ట్-స్కిల్ వర్సిటీ మార్గాన్ని ఫేజ్-3లో చేపట్టాలని కేంద్రమంత్రి ఖట్టర్‌ను కోరడం ప్రభుత్వ ప్రాధాన్యతను స్పష్టం చేస్తోంది.

## రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదు: హరీశ్ రావు ఆగ్రహం

హైదరాబాద్: వడ్ల కుప్పల వద్ద రైతుల గుండెల ఆగిపోతున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో ఇలాంటి పరిస్థితిని తెలంగాణలో ఎప్పుడూ చూడలేదని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని హరీశ్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నెల రోజులుగా వడ్లను కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. వడ్ల కుప్పల వద్దనే రైతుల గుండెలు ఆగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరుగుతున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారని, కానీ వాస్తవాలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయని మండిపడ్డారు. నేను వారిలా ఏసీ గదిలో కూర్చుని మాట్లాడటం లేదని విమర్శించారు. రైతుల మధ్య నిల్చుని, వారి గోడు విని మాట్లాడుతున్నానని అన్నారు. కల్లాలలో రైతులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. తేమ పరీక్షకు పదిరోజులు, గోనె సంచులకు వారం రోజులు, కాంటా (తూకం) పెట్టడానికి మరో వారం రోజులు పడుతుందని ఆరోపించారు. మిల్లులకు వెళ్లిన తర్వాత కూడా లారీకి నాలుగైదు బస్తాల వరకు కటింగ్ పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఆందోళనతో ఉన్నారని హరీశ్ రావు అన్నారు. చౌటుప్పల్ మార్కెట్‌లో వర్షం పడితే కనుక వడ్ల కుప్పలు నీట మునిగే ప్రమాదం ఉందని అన్నారు. ప్రభుత్వం వెంటనే యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు జరపాలని డిమాండ్ చేశారు. రైతుబంధు, యూరియా, రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. తరుగు పెడితే తోలు తీస్తామని గతంలో సీఎం చెప్పారని, ఇప్పుడు బస్తాకు రెండు మూడు కిలోల తరుగు తీస్తుంటే ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు.

# రాయితీపై యంత్ర పరికరాలు



యాడికి మే 07 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : రాయితీపై రైతులకు ట్రాక్టర్ మరియు వ్యవసాయ యంత్ర పరికరాలను అందజేసేందుకు ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకం అందుబాటులోకి తెచ్చింది. ఎస్సీ ఎస్టీ సన్న కారు రైతులు మరియు మహిళలకు యంత్రాల యూనిట్ ధరలో 50% చొప్పున ఓసి,బిసి ఇతర రైతులకు 40 % వరకు రాయితీ లభిస్తుంది 40 హెచ్ పి వరకు సామర్థ్యం గల ట్రాక్టర్ మరియు మినీ ట్రాక్టర్ రాయితీపై అంద చేయడం జరుగుతుంది. విత్తనం నాటే యంత్రాలు విత్తనంతో పాటు ఎరువును వేసే యంత్రాలు కోత నూర్పిడి యంత్రాలు పంటకోత తర్వాత వాడే యంత్రాలు ఎండు గడ్డి మేత సామాగ్రిని భద్రపరిచే యంత్రాలను లబ్ధిదారులకు అందిస్తారు వీటన్నిటిని జిల్లా సంయుక్త కలెక్టరు ఆధ్వర్యంలో లాటరీ ద్వారా ఎంపిక చేస్తారు. జిల్లా ఇన్చార్జి మంత్రి ఆమోదం తర్వాత లబ్ధిదారుల జాబితా విడుదలవుతుంది. ఎంపికైన వారి మొబైల్ ఫోన్లకు ప్రొసీడింగ్ మెసేజ్ లు వస్తాయి. ప్రొసీడింగ్లు ఇచ్చిన 15 రోజుల లోపల రైతులు తమ వాటాను డీలర్లకు చెల్లించాలి, ఆర్డర్ అందాక 15 రోజుల లోపల రైతులకు యంత్రాన్ని అందిస్తారు. రాయితీపై యంత్ర పరికరాలకు రైతు సేవ కేంద్రాలలో ఆన్లైన్లో మే 5 నుండి 19 వరకు రైతులు దరఖాస్తు చేసుకోవాలి, ప్రభుత్వం దగ్గర రిజిస్టర్ చేసుకున్న డీలర్ వద్ద పరికరాన్ని కొనుక్కోవచ్చు. మే 23 నుండి 25 వరకు లాటరీ ప్రక్రియ ఉంటుంది, ఎంపికైన వారికి మంజూరు పత్రం ఇస్తారు లబ్ధిదారులు 26 నుండి జూన్ 9 లోగా తమ వాటా సొమ్ము డీలర్ కు చెల్లించాలి మే 26 నుండి జూన్ 28 వరకు యంత్రాలు సరఫరా చేస్తారు జూన్ 30 నుండి డీలర్ ఖాతాలోకి సబ్సిడీ విడుదల అవుతుంది. 2024-25 సంవత్సరంలో రాయితీ పొందిన వారు అనర్హులు, కుటుంబంలో ఒక్కరు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.యాడికి మండలానికి మొత్తం 66 అన్ని రకాల వ్యవసాయ పనిముట్లు, 22.82 లక్షలు రాయితీ కేటాయించారని యాడికి మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా తెలిపారు....

## "ప్రతినెల ఆటో డ్రైవర్లకు ఎమ్మెల్యే బొలిశెట్టి ఆర్థిక సహాయం"



తాడేపల్లిగూడెం మే 7 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ) :పేదరిక నిర్మూలన,రాష్ట్ర అభివృద్ధి లక్ష్యం గా గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూపొందించిన ప్రా4 పథకంలో భాగంగా గౌరవ శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ప్రతి నెల ఇస్తున్న రూ.5000/- రూపాయలు ఆటో డ్రైవర్ లకు ప్రకటించిన సందర్భంగా 3 వ నెల బస్సు స్టాండ్ వద్ద ఉన్న ఫ్రెండ్స్ ఆటో యూనియన్ సభ్యుడు ఉప్పలపాటి వెంకటేశ్వరరావు భార్య సత్యవేణి కి గురువారం ఎమ్మెల్యే ఆయన సొంత నిధులు 5000/- రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి మద్దాల మణికుమార్, పసల కొండ, గట్టిం నాని, కామిశెట్టి శ్రీను, అడ్డగర్ల సురేష్, పట్టణ ఆటో వర్కర్ల సంఘం అధ్యక్షుడు కట్రెడ్డి వెంకటేశ్వరరావు, పట్టణ కార్యదర్శి బి ఎస్ వి వరప్రసాద్, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# యాడికిలో కెనరా బ్యాంక్ ఏటీఎం పునరుద్ధరణ

### మేనేజర్ కి ధన్యవాదాలు తెలిపిన ఎమ్మార్పీఎస్ నాయకులు




యాడికి మే 07 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ ఏటీఎం గత కొంతకాలంగా సాంకేతిక కారణాలతో పనిచేయక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్య ను ఎమ్మార్పీఎస్ నాయకుల దృష్టికి వెళ్లడంతో, వారు స్పందించి కొద్దిరోజుల క్రితమే బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మేనేజర్ తక్షణమే చర్యలు చేపట్టడంతో, ఏటీఎంకు మరమ్మతులు పూర్తయ్యి తిరిగి అందుబాటులోకి వచ్చింది. తమ వినతిపై సానుకూలంగా స్పందించి ఏటీఎంను పునరుద్ధరించినందుకు ఎమ్మార్పీఎస్ నాయకులు బ్యాంక్ మేనేజర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాతకుట్ల బాలు మాదిగ, మండల అధికార ప్రతినిధి చిటికెల చిరంజీవి మాదిగ, నాయకులు సురేంద్ర, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు...



# మహాత్మ జ్యోతిరావు పూలే ఎంట్రన్స్ పరీక్షలో విజన్ విద్యార్థుల ప్రభంజనం




యాడికి మే 07 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల కేంద్రంలోని విజన్ స్కూల్ విద్యార్థులు మహాత్మ జ్యోతిరావు పూలే ఎంట్రెన్స్ పరీక్షలో విజయదుందుభి మోగించారు. మహాత్మ జ్యోతిరావు పూలే ఎంట్రన్స్ పరీక్షలో నాలుగో తరగతికి చెందిన విద్యార్థులు బి. మనోహర్ నూటికి 93 మార్కుల తో జిల్లా 8వ ర్యాంక్ ను సాధించి పెన్నోబిలం లో సీట్ ను పొందడం జరిగింది , పి . వీర లోహిత్ నూటికి 90 మార్కుల తో 27 వ ర్యాంక్ సాధించి పెన్నోబిలం లో సీట్ ను, 89 మార్కులతో అలియా 35 వ ర్యాంక్ ను సాధించి నార్పల లో , అలాగే యస్. వైష్ణవి 82 మార్కులతో నార్పల లో, మనహ 82 మార్కులతో గుడిబండ లో నరసింహ రోహిత్,మినహాజ్ ఖాన్ 81 మార్కులతో లేపాక్షి లో,హరికృష్ణ 79 మార్కులతో పెన్నోబిలం లో, మహమ్మద్ హబీబ్ 77 మార్కులతో పెన్నోబిలం లో బి.ఈషా 76 మార్కులతో నార్పల లో ,దాసరి తేజశ్వని 75 మార్కులతో నార్పల లో, మిద్దె పవిత్ర గుడిబండ లో మాధురి గుడిబండ లో, కే. లావణ్య గుడిబండ లో, సైనా హీరెహాల్ లో ఝాన్సీ రాంపురం, హారిక నార్పల లో, వినోద్ కుమార్ రొద్దం లో లతీఫ్ బాషా గుండుమల లో, ఆఫ్రిన్ అంజూమ్ గోనబావి లో, శ్రీ విగ్నేశ్వరి హీరెహాల్ లో లలితా గ్రేస్ గోనబావి లోను అలాగే అంబేద్కర్ ఎంట్రన్స్ టెస్ట్ లో గుత్తి నందు ప్రమోదిని బ్రహ్మ సముద్రం లో సీట్లు సాధించారు..ఇంతటి ఘన విజయాన్ని సాధించిన విద్యార్థులను విజన్ కరస్పాండంట్ విశ్వనాధ్ ప్రత్యేక బహుమతులతో అభినందించారు.వీరి విజయం పట్ల విజన్ ఉపాధ్యాయ బృందం అమర్, కొత్త రాయుడు, శేఖర్, కోటి, హేమ మరియు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం వ్యక్తం చేశారు..

## "ఆర్ సి డి ఎస్ ఆధ్వర్యంలో పదో తరగతిలో 580 మార్కులు సాధించిన విద్యార్థికి మెమొంటో సాలువ బహుకరణ"



పెంటపాడు మే 7 (అవినాష్ మారంపూడి నేటి నేటి శుభోదయ) రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లా మరియు తూర్పుగోదావరి జిల్లాల ఇంచార్జ్ కర్రి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ ఎస్ సి పబ్లిక్ ఎగ్జామినేషన్స్ లో 580 మార్కులు సాధించినటువంటి నల్లమిల్లి ఆంజనేయరెడ్డి, శ్రీమతి ఆదిలక్ష్మి కుమార్తె ఖ్యాతి సత్య శ్రీ ని మెమొంటో, సాలువ, పూల బొకేతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్ సి డి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి విజయ్ ఆనంద్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ ఈ అమ్మాయి తల్లి ఆదిలక్ష్మి టీచర్ వృత్తిలో ఉండటం అలాగే తండ్రి ఆంజనేయ రెడ్డి వ్యాపారవేత్తగా మరియు మేనమామ సత్తి రామచంద్రారెడ్డి ప్రోత్సాహం ఎంతగానో ఉందని అలాగే ఈ అమ్మాయి భవిష్యత్తులో మంచి ర్యాంకులు సాధించాలని పలువురు పేర్కొన్నారు. ఈరోజు ఖ్యాతి సత్య శ్రీ పుట్టినరోజు సందర్భంగా ఆర్ సి డి ఎస్ కుటుంబ సభ్యులందరూ కూడా పుట్టినరోజు శుభాకాంక్షలు మరియు అత్యధిక మార్కులు సాధించినందుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప.గో. జిల్లా కమిటీ సభ్యులు కర్రి రవి కుమార్ రెడ్డి, కర్రి మురళీకృష్ణ రెడ్డి, వెలగల దాని రెడ్డి, కర్రి సూర్యనారాయణ రెడ్డి, కొవ్వూరు భాస్కర్ రెడ్డి (కిరాణా కొట్టు), కర్రి సత్యనారాయణ రెడ్డి, సత్తి రామచంద్ర రెడ్డి, కర్రి సూర్య రామ్ చరణ్ రెడ్డి, కర్రి సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి కార్టూన్ పోటీలో హరికృష్ణ కు ప్రతేక బహుమతి




పెనమలూరు, మే 7 ( అజయ్ నారగాని – నేటి శుభోదయ ) ప్రకృతి మనసుకు ప్రశాంతతను ఇస్తుందని, అదే భావాన్ని కార్టూన్ ద్వారా వ్యక్తపరచడానికి ప్రయత్నించానని హరికృష్ణ నాగేశ్వరం అన్నారు. జాతీయ స్థాయి కార్టూన్ పోటీలలో ఉయ్యూరు మండలం కలవపాముల గ్రామానికి చెందిన యువ కార్టూనిస్టు హరి కృష్ణ నాగేశ్వరం గీసిన కార్టూన్‌కు "వరల్డ్ కార్టూనిస్ట్ డే 2026" సందర్భంగా నిర్ అరుమళ్ళర్ల్ ఇన్ టైమ్స్ ఆఫ్ వార్ , స్కిప్ ఫారిన్ ట్రావెల్ -- కం టు బస్టార్ , వేర్ థెర్ ఈస్ పీస్ అండ్ గ్రీనరీ "(యుద్ధ సమయంలో 66 విదేశీ ప్రయాణం వద్దు – శాంతి, పచ్చదనం మెండుగా ఉన్న బస్తర్‌ను సందర్శించండి) అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీలో దేశవ్యాప్తంగా పలువురు కార్టూనిస్టులు పాల్గొన్నారని తెలిపారు.ఈ కార్టూన్ పోటీని ప్రముఖ జాతీయ మాస పత్రిక "కార్టూన్ వాచ్ ", "కేక్టస్ ", ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సాంస్కృతిక శాఖ, మరియు చ్ఛట్టిసగార్ టూరిజం బోర్డు సంయుక్తంగా నిర్వహించాయని చెప్పారు.యుద్ధాలు, ఉద్రిక్త పరిస్థితుల వార్తలతో విసిగిన మనకు ప్రకృతి ఒడిలో లభించే ప్రశాంతతను హరి కృష్ణ కార్టూన్‌లో ప్రతిబింబించారు. "గ్రీనరీ " మరియు "పీస్ " అనే భావాలను ప్రధానంగా చూపిస్తూ, బస్తర్‌ను శాంతి మరియు ప్రకృతి అందాల నిలయంగా చిత్రీకరించడం విశేషంగా నిలిచిందన్నారు. ఈ పోటీలో ప్రత్యేక బహుమతి లభించడం పట్ల హరి కృష్ణ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఇతర కార్టూనిస్టులు, కళాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. హరి కృష్ణ గతంలో కూడా పలు జాతీయ కార్టూన్ పోటీల్లో బహుమతులు పొంది, తన కార్టూన్లతో పుస్తకం ప్రచురించి తన ప్రతిభను చాటుకున్నారు. నా కృషిని గుర్తించి ప్రత్యేక బహుమతి ఇవ్వడం ఆనందంగా ఉందని , కార్టూన్ క్లాసుల ద్వారా కనుమరుగవుతున్న కార్టూన్ కళకు పూర్వ వైభవం తెచ్చే ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు.



# అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడు

### -క్షత్రీయ సేవా సమితి గౌరవాధ్యక్షులు గాదిరాజు జగ్గరాజు



గుడివాడ, మే 7 ( అజయ్ నారగాని – నేటి శుభోదయ ) అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడు అని గాదిరాజు జగ్గరాజు అన్నారు. గురువారం అల్లూరి సీతారామరాజు 102 వ వర్ధంతిని పురస్కరించుకుని గుడివాడ క్షత్రియసేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక కొత్త మున్సిపల్ ఆఫీస్ రోడ్ లోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న క్షత్రియ సేవా సమితి గౌరవాధ్యక్షులు జగ్గరాజు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్రం కోసం బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన ఆయన బ్రిటిష్ అధికారుల చేతుల్లో అతిపిన్న వయసులోనే వీరమరణం పొంది చిరస్మరణీయుడు అయ్యాడని అన్నారు. ఆయన త్యాగాన్ని జాతి మరువరాదన్నారు. తొలుత అల్లూరి విగ్రహానికి పూలదండలు వేసి జోహార్లు అర్పించారు. అనంతరం వెయ్యి పైగా బిర్యానీ ప్యాకెట్లను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో గుడివాడ క్షత్రియ సేవా సమితి అధ్యక్ష, కోశాధికారులు కోసూరి కామరాజు (రవిరాజు), కుచర్లపాటి శ్రీనివాసరాజు (వాసు) గౌరవ సలహాదారు రుద్రరాజు విజయ్ కుమార్ రాజు, ఉపాధ్యక్షుడు సాగిరాజు ఉదయభాస్కరరాజు, జాయింట్ సెక్రటరీ సాగిరాజు విజయ నాగరాజు, బి నాగవర్ధన్ రాజు, భూపతి రాజు శ్రీనివాసరాజు, సాగిరాజు గజపతిరాజు, సాగిరాజు సురేష్ వర్మ, కోసూరి శ్రీనివాసరాజు, గాదిరాజు గోపాలకృష్ణంరాజు, ఆర్ఎంపీల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుదే నాగ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడ ప్రజావేదికలో అల్లూరి 102వ వర్ధంతి

### -చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే రాము, కూటమి నేతలు.



గుడివాడ, మే 7 ( అజయ్ నారగాని – నేటి శుభోదయ ) స్వతంత్ర సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 102వ వర్ధంతి కార్యక్రమాలను గుడివాడ ప్రజావేదిక కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, కూటమి నాయకులు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా 'జోహార్ అల్లూరి సీతారామరాజు' అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ, "తెలుగు జాతి గర్వించదగ్గ విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజన్నారు. బ్రిటిష్ పాలకులను గడగడలాడించి, గిరిజనుల హక్కుల కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుడనీ కొనియాడారు. 'మన్యం దొర'గా పేరొందిన అల్లూరి త్యాగం, తెగువ, దేశభక్తి యావత్ భారత జాతికి స్ఫూర్తిదాయకమన్నాడు. కేవలం 27 ఏళ్ల వయసులోనే స్వాతంత్ర్య సంగ్రామంలో తన ముద్ర వేసిన అమరవీరుడు" అని కొనియాడారు.అల్లూరి సిద్ధాంతాలను, ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన స్ఫూర్తితో దేశ సేవకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఎమ్మెల్యే రాము పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ టిడిపి అధ్యక్షుడు పంద్రాజు సాంబశివరావు, నందివాడ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, టిడిపి నాయకులు గుడివాడ జోన్స్, యార్లగడ్డ సుధారాణి, కంచర్ల సుధాకర్, వద్దాది నాగరాజు, దేవేంద్రుడు, బొంబాయి శ్రీను, సయ్యద్ జబీన్,షణ్ముఖ రెడ్డి, దారపురెడ్డి మనీశ్వరరావు, కురాడ మధు, హరిబాబు, ఇమాన్యులు,తులసి రాణి, గొర్ల శ్రీలక్ష్మి, సునీత, సతీష్, రామకృష్ణ, మహేష్, డొక్కు మాల శ్రీకాంత్, మాణిక్యాలరావు,కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# హాస్పిటల్‌లో అగ్ని ప్రమాదాలపై అవగాహన




గుడివాడ, మే 7 ( అజయ్ నారగాని – నేటి శుభోదయ) అగ్నిమాపక కేంద్ర పరిధిలోని బైపాస్ రోడ్‌లోని సంజీవని హాస్పిటల్, ఏలూరు రోడ్‌లోని కరుణ హాస్పిటల్ సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అగ్నిమపక సిబ్బంది తెలిపారు. వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు అధికంగా సంభవించే అవకాశాలు ఉండటంతో హాస్పిటల్ సిబ్బందిని అప్రమత్తం చేసామని, హాస్పిటల్‌లో ఉన్న పేషెంట్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించామన్నారు. అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో పేషెంట్లు భయాందోళనలకు గురికాకుండా వారిని ప్రశాంతంగా సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానాన్ని వివరించారు. ముఖ్యంగా ఐ. సి. యు.లో చికిత్స పొందుతున్న పేషెంట్లు, వృద్ధులు మరియు అత్యవసర చికిత్సలో ఉన్న వారిని ముందుగా బయటికి తీసుకువెళ్లేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, హాస్పిటల్‌లలో ముఖ్యంగా ల్యాబ్‌లు మరియు ఐ. సీ. యు విభాగాల్లో అగ్ని ప్రమాదాలు



సంభవించే అవకాశాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించామన్నారు. అదేవిధంగా ఎలక్ట్రికల్ ఫైర్స్ జరిగినప్పుడు అనుసరించాల్సిన భద్రతా విధానాలను తెలియచేశామని, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు పొగ వల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడి ప్రాణాపాయం కలిగే అవకాశం ఉందని హాస్పిటల్ సిబ్బందికి తెలియజేశామన్నారు. అగ్నిప్రమాదం సమయంలో పొగ ఎక్కువగా వ్యాపించే ప్రాంతాల్లో తడిచేసిన గుడ్డతో ముక్కు, నోరు మూసుకుని కిందికి వంగి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించామన్నారు.అగ్నిప్రమాదం సంభవించిన సందర్భంలో పేషెంట్లను సురక్షితంగా బయటికి తరలించే విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించాము. అలాగే అగ్నిమాపక పరికరాల వినియోగంపై సిబ్బందికి శిక్షణ ఇచ్చి, తగిన సూచనలు ఇచ్చామన్నారు.

## ఖచ్చితమైన జనగణన వివరాలతోనే మున్సిపాలిటీకి నిధులు

### -ప్రజలు సహకరించాలి కమిషనర్ ఎస్. మనోహర్



గుడివాడ, మే 7 ( అజయ్ నారగాని – నేటి శుభోదయ) ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల పనితీరును పరిశీలించి, గృహాల వివరాల సేకరణను వేగవంతంగా మరియు ఖచ్చితంగా పూర్తి చేయాలని మునిసిపల్ కమీషనర్ ఎస్. మనోహర్ సూచించారు. గురువారం స్థానిక 2,3,33,34 వార్డులలో నిర్వహిస్తున్న జనగణన పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా జనగణన ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.అలాగే ప్రజలు జనగణన సిబ్బందికి పూర్తి సహకారం అందించి, ఖచ్చితమైన వివరాలు ఇవ్వాలని కమిషనర్ ఎస్. మనోహర్ కోరారు. జనగణన ఆధారంగానే మున్సిపాలిటీకి ఫైనాన్స్ కమిషన్ నుండి వచ్చే నిధులు నిర్ణయించబడతాయని, తప్పు వివరాలు అందించిన పక్షంలో నిధులు కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు. వార్డుల వారీగా జరుగుతున్న సెన్సస్ పురోగతిపై సంబంధిత సిబ్బందితో సమీక్ష నిర్వహించి, అవసరమైన సూచనలు చేశారు.

## భారత జాతి గర్వించదగ్గ మహానేత డా. బీఆర్. అంబేద్కర్

### -ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

### -గుడివాడలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

### -అన్ని వర్గాల సమానత్వం కోసం అంబేద్కర్ అలుపెరగని కృషి:ఎమ్మెల్యే రాము

### -రాజ్యాంగ నిర్మాత ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



గుడివాడ, మే 7 ( అజయ్ నారగాని – నేటి శుభోదయ ) భారత జాతి గర్వించదగ్గ మహానేత, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ అని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కొనియాడారు. గుడివాడ ఏలూరు రోడ్డులోని ఇండియన్ గ్యాస్ కంపెనీ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఎమ్మెల్యే రాము బుధవారం రాత్రి ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలతో ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ, "డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కేవలం ఒక వర్గానికే కాదు, యావత్ భారత జాతికి స్ఫూర్తి ప్రదాత అన్నారు. అంటరానితనం, సామాజిక అసమానతలపై అలుపెరగని పోరాటం చేసి దేశంలోని అన్ని వర్గాల సమానత్వం కోసం ఆయన శ్రమించారనీ కొనియాడారు. రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిన మహానుభావుడనీ, ఆయన చూపిన బాటలో నడిచి సామాజిక న్యాయం సాధించడం మనందరి బాధ్యత" అని పేర్కొన్నారు.అంబేద్కర్ ఆశయాలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆయన రచించిన రాజ్యాంగ స్ఫూర్తిని భావితరాలకు అందించాలని ఎమ్మెల్యే రాము పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ రాజబాబు, జనసేన ఇన్చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, బిజెపి నాయకులు వలపర్ల వెంకటేశ్వరరావు, టిడిపి గుడివాడ అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య, దళిత సంఘాల నేతలు పొంగులేటి జయరాజు, కంచర్ల సుధాకర్, విగ్రహ కమిటీ సభ్యులు: ఇంటి స్వామి దాసు, వీర బత్తిన జీవరత్నరాజు, దాసి మోహన్, నక్క రాజేష్, కారే శ్రీనివాస్, కొంద్రు జయరాజ్, విజయరాజు, రెంటపల్లి మ్యారియో,కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు, అంబేద్కర్ అభిమానులు పాల్గొన్నారు.

## ‘రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయశీ, భూ సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ సిద్ధం..’

**- జంబూపట్నం గ్రామంలో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ..**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, భూ సమస్యల పరిష్కారానికి తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. కోరుకొండ మండలం జంబూపట్నం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులైన రైతులకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రైతులకు భూ హక్కు పత్రాలు అందజేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ.... రైతులకు సాగు భూములపై సర్వహక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన ద్వారా అర్హులైన ప్రతి రైతుకు పాస్ పుస్తకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నాము. సాంకేతిక కారణాల వల్ల నిలిచిపోయిన సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. పాస్ పుస్తకాలు అందుకున్న రైతులు ఎమ్మెల్యేకి మరియు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ తాసిల్దార్ సుగుణ, కూటమి నాయకులు తన కాల నాగేశ్వరరావు, అడ్డాల శ్రీనివాస్, అడపా శ్రీనివాస్, చొంగా వెంకటేశ్వరరావు (డీలర్), మధురపూడి బుజ్జి జనసేన, వీరాంజనేయులు, తెలుగుదేశం, బీజేపీ పార్టీ నాయకులు, రెవెన్యూ అధికారులు, గ్రామ రైతులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోరుకొండ మండల ఈఓపీఆర్డీద బుడిద మహేశ్వర ప్రతాప్ సేవలు అభినందనీయం..!

**- రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ శ్రీమతి వెంకటలక్ష్మి**

**- ఈఓపీఆర్డీ బుడిద మహేశ్వర ప్రతాప్ పదవీ విరమణ మహోత్సవం -**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); కోరుకొండ మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ గా సేవలందించి రిటైర్ అవుతున్న బుడిద మహేశ్వర ప్రతాప్ పదవీ విరమణ మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మహేశ్వర ప్రతాప్ , వారి సతీమణిని దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సర్వీసులో



ఉంటూ ప్రజలకు మండలాభివృద్ధికి మహేశ్వర ప్రతాప్ అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు. వారి శేష జీవితం ఆరోగ్యంగా, ప్రశాంతంగా గడవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి అశోక్ కుమార్ మండల ప్రజా పరిషత్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది జనసేన మండల అధ్యక్షులు అడ్డాల శ్రీను, ముక్కా రాంబాబు, సీనియర్ కార్యదర్శి సురేష్, తెలుగుదేశం, జనసేన మరియు బిజెపి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మండల పరిషత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు పెద్దగుండాలమ్మ ఆలయంలో మహా అభిషేకం



**పులిచెర్ల, మే 7,(నేటి శుభోదయ) : చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం భీమవరం -- కొత్తపేట రహదారిలో వెలసిన శ్రీ పెద్దగుండాలమ్మ ఆలయంలో నేడు సాయంత్రం 6 గంటలకు మహా అభిషేకం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వాయిద్య బృందం, కోలాటాలతో ఆలయ ప్రాంగణం ఉత్సవ వాతావరణంలో మునిగిపోనుంది. అమ్మవారి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మహా అభిషేకాన్ని తిలకించి అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు కోరుతున్నారు.**

## గోసాలలో రెండుకోట్లతో నిర్మించిన రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్

**అభివృద్ధిని, సంక్షేమాన్ని అందించే కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి**

**-పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్**



పెనమలూరు, మే 7 ( అజయ్ నారగాని,- నేటి శుభోదయ ) కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో ఓటేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున చేపట్టి పూర్తి చేస్తున్నామని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు . గురువారం గోసాల గ్రామంలో రెండు కోట్లరూపాయలతో నిర్మించిన చింతలకట్ట, పాత సంత సీ సీ రోడ్లను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఒక్క గోసాల గ్రామంలోని రెండు సంవత్సరాలలో 3.5 కోట్లతో అభివృద్ధి పనులు చేయటం సామాన్యమైన విషయం కాదన్నారు. గోసాల,వణుకూరు ప్రధాన రహదారిని సుమారు ఏడు కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో కనీసం గుంటలు కూడా పూడ్చలేదని, కూటమీ ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాలలో నియోజకవర్గంలో సుమారు 200 కోట్లతో డ్రైనేజీలు, సిసి రోడ్లు నిర్మించామన్నారు. రాబోయే రెండు సంవత్సరాలలో నియోజవర్గంలో పెండింగ్లో ఉన్న పనులను పూర్తిస్థాయిలో చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్ రావు, పెనమలూరు మండల పార్టీ అధ్యక్షులు కోయ ఆనంద ప్రసాద్, రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పీత గోపీచంద్,రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ తాతపూడి గణేష్, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ బాలాజీ, బిజెపి నాయకులు ఏ కుల విజయేంద్ర, షేక్ మహబూబ్ సుభాని, ఎందువ రాంబాబు, కోనేరు వెంకటేశ్వరరావు, సుంకర రమేష్, మన్నె వాసు, పిడికిడి శ్రీనివాసరావు ,వల్లే నరసింహారావు, కోనేరు కోటేశ్వరరావు,అబ్దుల్ సలాం, డి ఈ శ్రీనివాస్, ఏఈ రాజేష్, ఇన్చార్జ్ ఎం డి వో బొమ్మసాని శ్రీనివాసరావు, కూటమి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## “రైతు సేవకే ప్రధమ ప్రాధాన్యం: ఎమ్మెల్యే బొలిశెట్టి”



తాడేపల్లిగూడెం మే 7 (అవినాష్ మారంపూడి నేటి శుభోదయ):: రైతుల సమస్యలన్నీ పరిష్కరించి వారి సేవకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం మోదుగుంట గ్రామంలోగురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు.పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి హయాంలో రైతులను నిర్లక్ష్యం చేశారని కనీసం పండించిన పంటకు డబ్బులు కూడా రాని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రైతు సమస్యల పరిష్కారానికి ప్రధమ ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలపై రాజముద్ర తో పంపిణీ చేశారన్నారు. రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుందనే ఆలోచనతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఒక రూపాయి కూడా అవినీతికి తావు లేకుండా ప్రభుత్వ ఉద్యోగులు సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఎమ్మెల్యే కార్యాలయం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా కార్యాలయంలో పది మంది ఉద్యోగులు సిద్ధంగా ఉంటారని ఆయన తెలియజేశారు. దేశంలో బిజెపి ప్రభుత్వం ప్రధాని మోడీ నాయకత్వంలో సమర్థవంతంగా పనిచేస్తుందని అన్నారు. ప్రపంచమంతా యుద్ధ భయంతో,రకరకాల సమస్యలతో ఉందని మోడీ నాయకత్వంలో భారతదేశం మాత్రం ప్రశాంతంగా అభివృద్ధి పథంలో పయనిస్తుందని అన్నారు. కులం మతం అంటూ మూఢ నమ్మకాలతో ఆలోచించకుండా ప్రజలకు మేలు చేసే కూటమి ప ప్రభుత్వానికి ప్రతి ఒక్కరు అండగా నిలవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ చంద్రశేఖర్,స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జున్, ఎమ్మార్వో రాజరాజేశ్వరి, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ ఈతకోట తాతాజీ, జనసేన మండల అధ్యక్షులు అడపా ప్రసాద్, చాపల రమేష్, పుల్ల బాబి, తాడేపల్లిగూడెం సొసైటీ త్రీమెన్ కమిటీ చైర్మన్ సిద్ధా వీరన్న, మద్దాల మణికుమార్, వాడపల్లి సుబ్బరాజు, పసుమర్తి రామ లక్ష్మణ్, కట్ట జానకి రామయ్య, దండుపోయిన వెంకటరమణ, ఏపూరి సత్యనారాయణ, వల్లేపల్లి సత్యనారాయణ, కూటమి నాయకులు మరియు అధికారులు పాల్గొన్నారు.

## రైతాంగ సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**-ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**

**-తాడిచెర్లలో రూ.96.17 లక్షలతో క్యాంబెల్ కెనాల్ రిటైనింగ్ వాల్‌కు శంకుస్థాపన చేసిన...ఎమ్మెల్యే=రిటైనింగ్ వాల్‌తో 4 గ్రామాల రైతుల దశాబ్దాల సమస్యకు పరిష్కారం:ఎమ్మెల్యే రాము**



గుడ్లవల్లేరు మే 7 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) రైతాంగ సంక్షేమానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ముఖ్యంగా గుడివాడ నియోజకవర్గంలో కాలువల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. గుడ్లవల్లేరు మండలం తాడిచెర్ల గ్రామంలో క్యాంబెల్ కెనాల్‌పై రూ.96.17 లక్షలతో నిర్మించనున్న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కూటమి నాయకులతో కలిసి గురువారం సాయంత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా వాల్ నిర్మాణం వల్ల కలిగే ప్రయోజనాలను అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ, “వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న గుడ్లవల్లేరు మండలంలో రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఈ రిటైనింగ్ వాల్ నిర్మాణంతో తాడిచెర్ల, కూరాడ, దగ్గుమిల్లి, చిన్నగొన్నూరు గ్రామాల రైతుల దశాబ్దాల సమస్య పరిష్కారం అవుతుందన్నారు. కీలకమైన క్యాంబెల్ కెనాల్‌లో వరదలు వచ్చినప్పుడు గ్రామంలోకి, వందల ఎకరాల పంట పొలాల్లోకి నీరు వచ్చి నష్టం జరిగేదనీ, వాల్ నిర్మాణం పూర్తయితే పంటలు మునిగే బాధ, పొలాలు కోతకు గురయ్యే సమస్య ఇక ఉండదు” అని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. నియోజకవర్గంలో కాలువల ఆధునికీకరణ, పటిష్టతతో ఆయకట్టు స్థిరీకరణ జరిగి రైతులకు, సాగునీటి భరోసా కలుగుతుందన్నారు. అనంతరం ముదినేపల్లి-విన్నకోట రహదారి నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో పరిసర గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే రాముకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, మండల పార్టీ అధ్యక్షులు పోలవరపు వెంకటరావు, కొండలమ్మ గుడి చైర్మన్ ఈడే మోహన్,కూటమి నాయకులు వల్లభనేని రంగబాబు,కొడాలి రామరాజు, మల్లీపెద్ది సుబ్రమణ్యం, కళ్యాణపు నవాబు, సాయన ప్రసాద్, కాగిత నరేంద్ర, పెన్నేరు రమేష్, అబ్దుల్ కరీం, మధు, సీరం నాగ రమేష్, గోపాల్, బాస రాంబాబు, తాడిచర్ల గ్రామ నాయకులు జొన్న లక్ష్మీ దుర్గ,బెజవాడ రఘు, పళ్లెం చిన్న బాలకృష్ణ, వేమన వెంకటేశ్వరరావు, బెజవాడ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ‘ బి.ఎల్.ఏ. పట్ల అవగాహన పెంచుకుంటూ.. బూత్ స్థాయి నుండే పార్టీని మరింత బలోపేతం చేయాలి..’

**- కోరుకొండ బీజేపీ కార్యాలయం వద్ద బి.ఎల్.ఏ -2 సమావేశంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపు**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బి.ఎల్.ఏ-2 (బూత్ స్థాయి ఏజెంట్) సమావేశం గురువారం సాయంత్రం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి అనపర్తి నియోజకవర్గ శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ముందుగా ఐదు రాష్ట్రాల్లో బిజెపి విజయం సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పార్టీకి బూత్ స్థాయి కార్యకర్తలే వెన్నెముక అని కొనియాడారు. ప్రతి కార్యకర్త సమన్వయంతో పని చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని పిలుపునిచ్చారు. అనంతరం రాజనగరం నియోజకవర్గ బి.ఎల్.ఏ-1, సీనియర్ నాయకులు ఏపీఆర్ చౌదరి మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణలు మరియు క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సమావేశంలో బిజెపి మండల అధ్యక్షులు అడపా సుధీర్ కుమార్, బిజెపి జిల్లా మహిళా అధ్యక్షురాలు మద్దిపాటి రజిని, మోదీ సత్తిబాబు, పెనకటిరాంబాబు, తనకాల శ్రీనివాస్ నాయుడు, తగరంపూడి గణపతి, బిజెపి ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు పచ్చారి నరసింహమూర్తి, చిర్ల ఆది విష్ణు, తదితరులు ప్రసంగించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బి.ఎల్.ఏ ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధిపై ఎంపీ చిన్ని, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ మధ్య కీలక చర్చలు



విజయవాడ, మే 7 (నేటి శుభోదయ):- విజయవాడ ఎం.పి కార్యాలయంలో గురువారం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థాన పాలకమండలి చైర్మన్ బొర్ర రాధకృష్ణ విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ప్రధానంగా దుర్గమ్మ ఆలయ అభివృద్ధి, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, రాబోయే ప్రాజెక్టులపై విస్తృతంగా చర్చించారు. అలాగే ఆలయ సమగ్ర అభివృద్ధిలో భాగంగా ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్ పనుల ప్రస్తుత స్థితిగతులను సమీక్షించారు. కొండపైకి వచ్చే సామాన్య భక్తులకు క్యూలైన్లు, మంచినీరు, వసతి సౌకర్యాలను మరింత మెరుగుపరచడంపై దృష్టి సారించారు.

## ఇంద్రకీలాద్రిపై భక్తుల దాహార్తిని తీర్చేందుకు వాటర్ ప్లాంట్ కు విరాళం అందజేత



విజయవాడ, మే 7 (నేటి శుభోదయ):- ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం వెలగపూడి శంకర్ బాబు, శ్రీదేవి దంపతులు తమ మనవడు సుహాస్ కృష్ణ పేరు మీద సుమారు లక్ష విలువైన వాటర్ ప్లాంట్‌ను విరాళంగా అందజేశారు. వేసవి కాలంలో భక్తులకు ఎదురయ్యే మంచినీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని, ఓం టర్నింగ్ వద్ద ఈ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. 300 లీటర్ల సామర్థ్యం గల ఈ వాటర్ ప్లాంట్ ద్వారా కొండపైకి వచ్చే వేలాది మంది భక్తులకు స్వచ్ఛమైన త్రాగునీరు అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా దాత వెలగపూడి శంకర్ బాబు మాట్లాడుతూ అమ్మవారి సేవలో భాగస్వాములవ్వడం, భక్తుల దాహార్తిని తీర్చే క్రమంలో ఈ చిన్న సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. ఆలయ అధికారులు దాతల దాతృత్వాన్ని అభినందిస్తూ, వారికి చిత్రపటాన్ని, శేషవస్త్రాని, అమ్మవారి ప్రసాదాలను అందజేసి ఆలయ మర్యాదలతో సత్కరించారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా ఈ కొత్త వాటర్ ప్లాంట్ భక్తులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

## ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్లానింగ్ విభాగానికి ప్రత్యేక శిక్షణ ఏపీడీపీఎంఎస్ ట్రైనింగ్ 2.0 కార్యక్రమం నిర్వహణ




విజయవాడ, మే 7 (నేటి శుభోదయ):- ప్రజలకు పట్టణ ప్రణాళిక సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా, సులభతరంగా అందించాలనే లక్ష్యంతో పురపాలక, పట్టణ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్లానింగ్ విభాగ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఏపీడీపీఎంఎస్ ట్రైనింగ్ 2.0 కార్యక్రమాన్ని గురువారం విజయవాడలో నిర్వహించారు. రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, రాజమండ్రి ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రం, వన్‌టౌన్‌లో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సాఫ్ట్ టెక్ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ సంధ్య శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన భవన నిర్మాణ ప్లాన్ల పరిశీలన, అభివృద్ధి అనుమతుల జారీ ప్రక్రియ, ఆన్‌లైన్ సేవల సమర్థ వినియోగం, ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు వంటి అంశాలపై నిపుణులు సవివరంగా అవగాహన కల్పించారు. అలాగే నగరాభివృద్ధి, ఆధునిక పట్టణ ప్రణాళిక విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ప్రజా ఫిర్యాదుల పరిష్కార విధానం, సేవల సరళీకరణ తదితర అంశాలపై కూడా సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీడీ రాజమండ్రి జి. సుబ్బారావు, ఏపీ సీఆర్‌డీఏ జాయింట్ డైరెక్టర్లు, ఎల్‌టీపీ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రతినిధులు, సాఫ్టెక్స్ సంస్థకు చెందిన సంధ్య, ఆమె బృందం, విజయవాడ నగరపాలక సంస్థ ప్లానింగ్ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

## అల్లూరి సీతారామరాజు ప్రదర్శించిన దేశభక్తి, ధైర్యం, త్యాగం అందరికీ మార్గదర్శకం



విజయవాడ, మే 7 (నేటి శుభోదయ):- విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం లోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద, గురువారం ఉదయం అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకొని కమిషనర్ ధ్యానచంద్ర నివాళులు అర్పించారు. ముందుగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు మన దేశ చరిత్రలో స్వాతంత్ర్య సమరయోధుడిగా చిరస్థాయిగా నిలిచిపోయారని, అతని ధైర్యం, త్యాగం, దేశభక్తి మనకు ఎప్పటికీ పాఠాలుగా ఉంటాయని, అటువంటి మహానుభావుడికి నివాళులు అర్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ కె. ప్రభుదాస్, చీఫ్ సిటీ ప్లాన్నార్ కె. సంజయ్ రత్న కుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె . అర్జునరావు, చీఫ్ ఇంజినీర్ ఇంచార్జి పి. సత్యకుమారి, అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణమూర్తి, సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఏ శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శ్రీనివాస్, సామ్రాజ్యం, సురేఖ, గోపాలకృష్ణ,ప్రభాకర్,డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ గోపాల నాయక్, వివిఎంసి సిబ్బంది, పాల్గొని అల్లూరి సీతారామరాజును స్మరించుకున్నారు.

## రానున్న వర్షాకాలం దృశ్య నగరంలోని డీసిల్టింగ్ పనులను పూర్తిస్థాయిలో చేస్తున్నాం

: వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, మే 7 (నేటి శుభోదయ):- రానున్న వర్షాకాలం దృశ్య నగరంలోని డీసిల్టింగ్ పనులను పూర్తిస్థాయిలో చేస్తున్నామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం ఉదయం తన పర్యటనలో భాగంగా రమేష్ హాస్పటల్ రోడ్డు, గురునానక్ కాలనీ రోడ్, ఆటోనగర్ గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్, పంట కాలువ రోడ్డు, పటమట ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని డీసిల్టింగ్ ప్రక్రియను పూర్తిస్థాయిలో చేయాలని, ఎప్పటికప్పుడు డీసిల్టింగ్ పనులను అధికారులు పర్యవేక్షిస్తుండాలని, వర్షాకాలం లో రోడ్డుమీద నీటి నిల్వలు ఉండకుండా ఉండాలంటే డీసిల్టింగ్ ప్రక్రియ ఇప్పుడు పూర్తిస్థాయిలో చేస్తేనే అది సాధ్యమవుతుందని అన్నారు. ఆటోనగర్ లో గల గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ ను పరిశీలించి, వ్యర్థాలను ఎప్పటికప్పుడు జిందాల్ కు తరలించేరా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పటమట లో గల అన్న క్యాంటీను క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడికి వచ్చిన ప్రజలకు ఆ అన్న క్యాంటీన్లో ఉన్న వసతులపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. వసతులన్నీ చాలా బాగున్నాయి అని వారు తెలుపగా, సంతృప్తి చెందారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆహారంలో నాణ్యత, త్రాగునీటి సరఫరా, అన్న క్యాంటీన్లో గల సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తమకు నివేదికను సమర్పిస్తుండాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె. షమ్మీ, సుప్రింటెంటింగ్ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఎస్సీ కుటుంబం నుండి ఒక పారిశ్రామికవేత్త రావాలి ఎంపీ కేశినేని చిన్ని వెల్లడి



విజయవాడ, మే 7 (నేటి శుభోదయ):- విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ఎస్సీ యువతకు ఎంపీ కేశినేని చిన్ని శుభవార్త చెప్పారు. జిల్లా కలెక్టర్ సమక్షంలో నేషనల్ ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ జరిగిందని ప్రతి ఒక్క ఎస్సి కుటుంబం నుంచి నుండి ఒక నూతన పారిశ్రామికవేత్త రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ విజయవాడ పార్లమెంట్ పరిధిలో ఉన్న నిరుద్యోగ ఎస్సీ యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు తానెల్లప్పుడు ముందే ఉంటానని ఎంపీ చిన్ని పేర్కొన్నారు. ఎస్సీ యువత ఆర్థికంగా అభివృద్ధి సాధించి పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయని ఎంపీ వెల్లడించారు. ముఖ్యమంత్రి ఆకాంక్ష ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామికవేత్త ఉండాలని లక్ష్యంతో నే తాను కూడా నేషనల్ ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులతో చర్చలు జరిపి విజయవాడకు తీసుకువచ్చినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ సమక్షంలో నేషనల్ ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ తో అవగాహన ఒప్పందం కుదిరిందని స్వయంగా ఎంపీ నే స్పష్టం చేశారు. ఈ ఒప్పందం ద్వారా ఎస్సీ యువత వ్యాపారానికి కావలసిన ఆర్థిక సహకారంతో పాటు మార్కెటింగ్ రంగంలో కూడా పూర్తి సహాయం అందిస్తామని ఎంపీ తెలియజేశారు. సుమారు 2000 మంది యువత ను ఎంపిక చేసి వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కార్పొరేషన్ అంగీకారం తెలిపినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏ కుటుంబానికి కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని ఎంపీ చిన్ని తెలిపారు.

## ఉర్దూ భాష అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది: గద్దె క్రాంతి కుమార్



విజయవాడ, మే 7 (నేటి శుభోదయ):- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండవ అధికార భాష అయిన ఉర్దూపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించడంతో పాటు యువతకు భాషా ప్రావీణ్యం కల్పించే లక్ష్యంతో ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీ రాష్ట్రవ్యాప్తంగా ఈ వేసవి సెలవుల్లో ఉచిత ఉర్దూ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ పేర్కొన్నారు. గురువారం ఉదయం అశోక్ నగర్ లోని తూర్పులోని టీడీపీ కార్యాలయంలో ఉర్దూ ఫ్రీ క్యాంప్కు సంబంధించిన పుస్తకాన్ని టీడీపీ నాయకులు గద్దె క్రాంతి కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఉర్దూ భాషకు ఆంధ్రప్రదేశ్లో ప్రత్యేక స్థానం ఉందని, భాషల పరిరక్షణ, అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఉర్దూ నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులు, యువత ఈ ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీ సిబ్బంది, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పేదల పాలిట అండగా నిలుస్తున్న ప్రజానాయకుడు



విజయవాడ, మే 7 (నేటి శుభోదయ):- అజిత్ సింగ్నగర్లోని సెంట్రల్ కార్యాలయంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు, ప్రజా సేవనే పరమావధిగా భావిస్తూ, ప్రభుత్వ సహాయం అందక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు తన సొంత నిధులతో అండగా నిలుస్తూ నిజమైన ప్రజానాయకుడిగా నిలుస్తున్నారు. సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పెన్షన్ అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న 25వ డివిజన్కు చెందిన ఇనుకుల సీతామహాలక్ష్మి కు, 61వ డివిజన్ ప్రశాంతి నగర్కు చెందిన నిజాంపట్నం సుధాకర్ కు ప్రతినెలా రూ. 4,000 చొప్పున తన సొంత నిధుల నుండి పెన్షన్ అందజేస్తూ వారి కుటుంబాలకు భరోసాగా నిలుస్తున్నారు. రాజకీయాల్లో ఉన్నప్పటికీ ప్రజల కష్టాలను తన కుటుంబ సమస్యలుగా భావించి స్పందించడం బొండా ఉమా ప్రత్యేకతగా ప్రజలు పేర్కొంటున్నారు. ప్రజల కోసం ఎప్పుడూ అందుబాటులో ఉంటూ, ఎవరికైనా కష్టం వచ్చిందంటే ముందుగా స్పందించే నాయకుడు బొండా ఉమామహేశ్వరరావు అని స్థానికులు కొనియాడుతున్నారు. పదవి కోసం కాదు, ప్రజల ప్రేమ కోసం పనిచేసే నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. ప్రభుత్వం చేయాల్సిన సహాయం ఆలస్యం అయినా, పేదల కష్టాలు ఆగవని ఎస్సీ భావించి తన సొంత డబ్బులతో ముందుకు రావడం ఆయన గొప్ప మనసుకు నిదర్శనమని అన్నారు. లబ్ధిదారులు మాట్లాడుతూ గత ఏడాది నుంచి బొండా ఉమా తమకు ప్రతి నెలా క్రమం తప్పకుండా ఆర్థిక సహాయం అందజేస్తున్నారని, ఈ సహాయం తమ కుటుంబానికి జీవనాధారంగా మారిందని తెలిపారు. ఇలాంటి మానవత్వం కలిగిన నాయకుడు తమకు దొరకడం అదృష్టమని ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలు మాట్లాడుతూ, సెంట్రల్ నియోజకవర్గ ప్రజల పట్ల బొండా ఉమాకు ఉన్న అనుబంధం ఎంతో గొప్పదని, పేదల కష్టాలను అర్థం చేసుకుని వెంటనే స్పందించే నాయకుడు రాష్ట్రంలో అరుదుగా కనిపిస్తారని అన్నారు. ముఖ్యంగా మైనారిటీల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ, ఎవరికైనా అవసరం వచ్చినప్పుడు ముందుండి సహాయం చేయడం ఆయన సేవాభావానికి నిదర్శనమని కొనియాడారు. ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఉమాకు ఎల్లప్పుడూ తమ ఆశీస్సులు, మద్దతు ఉంటాయని తెలిపారు.

# నగరాభివృద్దే ప్రథమ లక్ష్యం, ప్రజల క్షేమమే ప్రధాన ధ్యేయం




విజయవాడ, మే 7 (నేటి శుభోదయ):- నగరాభివృద్దే ప్రథమ లక్ష్యం, ప్రజల క్షేమమే ప్రధాన ధ్యేయంగా ప్రజా ప్రతినిధులు, వియంసి అధికారుల మధ్య సమన్వయ సమావేశాన్ని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర నిర్వహించారు. గురువారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో పార్లమెంట్ సభ్యులు కేసినేని శివనాథ్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, సెంట్రల్, పశ్చిమ నియోజకవర్గం ప్రతినిధులతో శాఖధిపతుల సమక్షంలో ఈ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ ధ్యానచంద్ర విజయవాడ నగరపాలక సంస్థ లో జరుగుతున్న పనులను, స్థితిగతులను తెలిపారు. అందులో భాగంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ 2026లో భాగంగా మూడు చెత్తబుట్టలకు బదులుగా నాలుగు చెత్తబుట్టలను వాడుతున్నామని, వేసవికాలం దృశ్య పెట్టిన 106 చలివేంద్రాలు, సమ్మర్ యాక్షన్ ప్లాన్ అలాగే వర్షాకాలం దృశ్య నిర్వహిస్తున్న డిసిల్టింగ్ పనులు, అమృత్ 1.0 స్థితిగతులు, నగరపాలక సంస్థ ఆస్తులకు పై వర్తిస్తున్న కొత్త జీవో ఎంఎస్ 92, దాని ప్రకారంగా మూడు సంవత్సరాలకు వేసే 33% పెరుగుదలను ప్రతి సంవత్సరం 7% వేస్తున్నట్లు తద్వారా లీజుదారులకు అద్దె తగ్గుతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్ మధ్య వ్యత్యాసం లేకుండా ఉన్నా రెంటును, ఇప్పుడు గ్రౌండ్ ఫ్లోర్ ఫస్ట్ ఫ్లోర్ కు 20% వ్యత్యాసం, సెకండ్ ఫ్లోర్ కి 30% వ్యత్యాసం ఈ జీవో ద్వారా ఉండబోతుందని తెలిపారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎం.పి కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఆదాయం పెరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని అందులో భాగంగా నగరంలోని కల్యాణ మండపాలకు మరమ్మతులు నిర్వహించి వాటికి తగ్గట్టుగా ప్రజలకు అందుబాటుగా ఉండేటట్టుగా రేటును నిర్ణయించాలని తెలిపారు. నగరంలోని ప్రధాన ఉద్యానవనాలకు ఫుడ్ స్టాల్ ఏర్పాటు చేయాలని, రోడ్లు వేసే ముందే డ్రైన్ పనులన్నీ పూర్తి చేసుకొని రోడ్లు, డ్రైన్లు, పేవర్ బ్లాక్ అన్ని ఒక్కసారిగా వేసేటట్టు చర్యలు తీసుకోవాలని అన్నారు. రైల్వే స్టేషన్ కి వెళ్లే దారిలో ఉన్న బి ఆర్ టి ఎస్ రోడ్డు చివరి భాగంలో ఫుడ్ కోర్ట్ ని ఏర్పాటు చేయాలని, అలాగే పాలిటెక్నిక్ కాలేజ్ సర్వీస్ రోడ్డు వద్ద గల గ్రీన్ స్పేస్ లో దారి, లైటింగ్ ఏర్పాటు చేసి ఫుడ్ కోర్ట్ ను ఏర్పాటు చేయాలన్నారు. స్టాం వాటర్ డ్రైన్ స్థితిగతులను తెలుసుకున్నారు. రానున్న వర్షాకాలం దృశ్య రోడ్డు మీద నీటి నిలువలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ కొండ ప్రాంత వాసులకు రక్షణగా ప్రమాదకరమైన ప్రదేశాలలో కంచెను ఏర్పాటు చేయాలని, వర్షాకాలంలో కొండపై నుంచి వచ్చే నీరుకు ఒక ప్రత్యేక కాలువను ఏర్పాటు చేసి తద్వారా మేజర్ కాలువలోకి కలపాలని కోరగా, స్టాం వాటర్ డ్రైన్ ప్రాజెక్ట్ డి పి ఆర్ లో భాగంగా అది కూడా ఉందని అధికారులు తెలిపారు. నగరపాలక సంస్థ కళ్యాణ మండపాలలో కేవలం విఎంసి సిబ్బందికి మాత్రమే కాకుండా అక్కడ ఉండే స్థానికులకు కమిటీ సభ్యులుగా ఉంచి కళ్యాణ మండపాల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తే నగరపాలక సంస్థకు ఆదాయం పెరుగుతుందని సూచించారు. రివర్ ఫ్రంట్ పార్కును పూర్తి చేయాలని, కృష్ణలంక వైపు నుంచి పార్కుకి వెళ్లే దారి ప్రతి సందు నుంచి మెట్ల మార్గం ద్వారా కల్పించాలని అన్నారు. పశ్చిమ నియోజకవర్గం, సెంట్రల్ నియోజకవర్గం ప్రతినిధులు తరపున వారి ప్రతిపాదనలను తెలిపారు అందులో భాగంగా పశ్చిమ నియోజకవర్గంలో ప్రజలకు ఖాళీ స్థలాలలో పార్కులను ఏర్పాటు చేయాలని, ఎర్రకట్ట ఆర్ఓబి, పంచా సెంటర్ ఎఫ్ఓబి, తదితర అంశాలు తెలుపుగా వాటి స్థితిగతులను అధికారులు తెలుపారు. అలాగే సెంట్రల్ నియోజకవర్గం నుండి ఐకానిక్ పార్క్ ను పూర్తి స్థాయిలో పూర్తి చేయాలని, ఉన్న పార్కులను మరమ్మతులు చేయించి ప్రజలకు అందుబాటులో చేసేటట్టు చర్యలు తీసుకోవాలని, బావాజి పేట కెనాల్ బండ్ వద్ద వాకింగ్ ట్రాక్, వైవిఆర్ ఎస్టేట్ యు జి డి వంటి అంశాలను అధికారులకు తెలుపగా, అధికారులు ఐకానిక్ పార్క్ లో కోటి రూపాయల అభివృద్ధి పనులు సాంక్షన్ అయ్యి జరుగుతున్నాయని, మిగతా వాటి స్థితిగతులను తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ కె. ప్రభుదాస్, కె. షమ్మీ, చీఫ్ సిటీ ప్లాన్నార్ కె. సంజయ్ రత్న కుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె . అర్జునరావు, చీఫ్ ఇంజినీర్ ఇంచార్జి పి. సత్యకుమారి, అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణమూర్తి, సూపరిండెంటింగ్ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఏ శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శ్రీనివాస్, సామ్రాజ్యం, సురేఖ, గోపాలకృష్ణ,ప్రభాకర్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ గోపాల నాయక్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డి హరీష్, బయాలజిస్ట్ కామేశ్వరరావు పాల్గొన్నారు.

# ప్రకాశం జిల్లా తెలుగు వెలుగులు- విశిష్ట సాహిత్య సదస్సు

ఒంగోలు, నేటి శుభోదయ ::: ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాలుగువ ప్రపంచ తెలుగు మహా సభలు - (బాలలు) డిసెంబర్ 2026 సందర్భంగా ప్రకాశం జిల్లా లో జన్మించిన తెలుగు వెలుగులను స్మరించుకునేందుకు వేదికగా ప్రకాశం జిల్లా తెలుగు వెలుగులు సాహిత్య సదస్సును 10 మే 2026, నెక్స్ట్ జన్ ఇంటర్నేషనల్ స్కూల్, ఒంగోలు ప్రాంగణం లో ఉదయం 9గంటలకు ప్రారంభించనట్లు పరిషత్తు అధ్యక్షులు డా. గజల్ శ్రీనివాస్, సమన్వయ కర్తలు డా. కే. మురళీ ధర్ రెడ్డి, కోగంటి శ్రీనివాస్, సంచాలకులు పొన్నూరు వేంకట శ్రీనివాస్ తెలిపారు. ఈ సదస్సులో ప్రఖ్యాత కవులు, సాహితీ మూర్తులు పాల్గొని, ప్రకాశం జిల్లా తెలుగు వెలుగులపై ప్రసంగిస్తారని డా. గజల్ శ్రీనివాస్ తెలిపారు. సదస్సులో పాల్గొనే వక్తలు. 1. డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు - మూడమంచు వెంకటేశ్వర్లు2. బి.హనుమారెడ్డి - పాలూరి శివప్రసాద్ 3. డాక్టర్ ధారా రామనాథశాస్త్రి - (పద్యకవి ఉపన్యాసకులు) - కప్పగంతుల మధుసూదన శాస్త్రి4. మల్లవరపు జాన్ (పద్యకవి) - డాక్టర్ నూకతోటి రవికుమార్5. ఈమని దయానంద (అభ్యుదయ కవి) - డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు6. భానుమతి రామకృష్ణ (కథా రచయిత్రి) - అన్ను విజయకుమారి7. మహాస్వప్న (దిగంబర కవి) - ఎస్.ఎం.డి.రఫి8. ఎర్రనామాత్యుడు (ప్రబంధ కవి) - గాడేపల్లి దివాకరదత్తు9. వేటపాలెం సారస్వత నికేతన్ ((గ్రంథాలయం) - కాంతి నల్లూరి10. ప్రకాశం జిల్లా సాహిత్యరంగం - డాక్టర్ నూనె అంకమరావు 11. ప్రకాశం జిల్లా కళారంగం - అంగలకుర్తి ప్రసాద్12. ప్రకాశం జిల్లా అవధాన రంగం - అష్టావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం13. ప్రకాశం జిల్లా నాటకరంగం - పిన్ని వెంకటేశ్వర్లు14. ప్రకాశం జిల్లా జానపద రంగం- విద్వాన్ జ్యోతి చంద్రమౌళి15. ప్రకాశం జిల్లా రచయిత్రులు - పి.రాజ్యలక్ష్మి 16. కొలకలూరి స్వరూపరాణి (తొలితెలుగు స్త్రీవాద కవయిత్రి) - టి.అరుణ17. త్యాగరాజస్వామి (సంగీతం) - బీనీడి కృష్ణయ్య 18. శ్యామశాస్త్రి (సంగీతం) - నెమ్మాని సీతారామమూర్తి 19. ఎం.ఎస్.బాలసుబ్రహ్మణ్య శర్మ (సంగీతం) - ఐ.మురళీకృష్ణ20. రాయప్రోలు సుబ్బారావు (భావ కవి) - ఎస్.కె.వి.ప్రసాద్21. ఎం.వి.ఎస్.హరనాథరావు (నాటక రచయిత) యు.వి.రత్నం22. తరువోజ పద్యశాసనం (అద్దంకి) - పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి23. టి.కృష్ణ (సినీదర్శకులు) - సయ్యద్ ఇస్మాయిల్24. ఎం.వి.ఎస్.శర్మ (కవి, రచయిత) - ఎం.వి.ఎస్.శాస్త్రి25. కందుకూరి రుద్రకవి (జనార్ధనాష్టకం) - గణపతిరాజు వెంకట మాల్యాద్రి26. నాయని సుబ్బారావు (భావకవి) - అనఘా ఝాన్సీ సుబ్బారావు పాల్గొని ప్రసంగిస్తారు. కనుక జిల్లాలోని కవులు రచయితలు భాషాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విశిష్ట సాహిత్య సదస్సుని విజయవంతం చేయవలసిందిగా గజల్ శ్రీనివాస్ కోరారు.

## కడపజిల్లా పులివెందుల వికలాంగుల కార్యాలయంలో ఘనంగా అల్లూరి సీతారామరాజు 102 వ వర్ధంతి వేడుకలు

– భరతమాత ముద్దుబిడ్డ అల్లూరి నిష్కళంక దేశభక్తుడు



– స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ ఆర్ఎస్ఎస్ పులివెందుల, నేటి శుభోదయ ::: బ్రిటిష్ వారి ఏలుబడిలో ఎన్నోరకాల బాధలకు, అణచివేతలకు గురైన భారతదేశ ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు, భరతమాత దాస్యశృశీఖలాలను తెంచేందుకు, తనకున్న పరిమితమైన వనరులతో, గిరిజన యువతతో, సాంప్రదాయ ఆయుధాలతో, అతిపెద్ద బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదిరించి, సాయుధపోరాటం ద్వారా దేశానికి స్వాతంత్రం సిద్ధింపజేయాలని, వివిధ పోలీస్ స్టేషన్లపై మెరుపుదాడులతో ఆయుధాలు, మందుగుండును చేజిక్కించుకొని, బ్రిటిష్ వారికి కంటిపై కునుకు లేకుండా చేసిన మన్యంవీరుడు, విప్లవజ్యోతి, అగ్గిపిడుగు అల్లూరిసీతారామరాజు భరతమాతను తెల్లవారి చెరనుండి విడిపించేందుకు చేసిన సాయుధపోరాటం చారిత్రాత్మకమైనదని, ఈపోరాటంలో ఆయన 1924 మే 7వ తేదీన, 27సంవత్సరాల చిన్నవయసులోనే అమరుడయ్యాడని, ఆయనమరణం దేశంలో ఎన్నో విప్లవోద్యమాలకు, స్వాతంత్ర కాంక్షకు తెరలేపిందని, తెలుగువాడైన అల్లూరి త్యాగనిరతి దేశానికే ఆదర్శంగా మారిందని వ్యవసాయ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్ స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ ఆర్ఎస్ఎస్ రామిశెట్టి శివశంకర్ పేర్కొన్నారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 102 వ వర్ధంతిని పురస్కరించుకొని, స్థానిక ముద్దనూరురోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన ఒకకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ ఆర్ఎస్ఎస్, దివ్యాంగులతో కలిసి అల్లూరి చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళి అర్పించారు. అనంతరం ఆయన ఆత్మశాంతి కొరకు రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. తదనంతరం దివ్యాంగులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన రీసెర్చ్ ఫౌండేషన్ ద్వారా వికలాంగుల కమ్యూనిటీ భవనంలో దివ్యాంగులకు వ్యవసాయ అనుబంధమైన చేతివృత్తుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి నిరుద్యోగ వికలాంగులకు ఉపాధి కల్పిస్తామని, దివ్యాంగుల పిల్లలలో చదువుకుంటున్న వారికి ఉపకారవేతన చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని త్వరలో చేపడతానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్రఅధ్యక్షులు డా.ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, జై భారత్ సంస్థ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బ్రాహ్మణపల్లి శ్రీనివాసులు, వికలాంగుల నెట్ వర్క్ కార్యవర్గసభ్యులు శివాజీ రాజారెడ్డి, వేణుగోపాల్, టైలరింగ్ సెంటర్ శిక్షణార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ 'మహానాడు' ఏర్పాట్లులో రాజానగరానికి దక్కిన ప్రాధాన్యత..!

– మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత సీఎం కార్యక్రమాల సమన్వయకర్త (కేబినెట్ హోదా)

పెందుర్తి వెంకటేష్ కు సభా ప్రాంగణ పర్యవేక్షణ కమిటీలో చోటు..!

– ఆనందాహర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న తెలుగు తమ్ముళ్లు..!



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);నెల్లూరు వేదికగా జరగనున్న తెలుగుదేశం పార్టీ వార్షిక పండుగ 'మహానాడు' కోసం పార్టీ అధిష్టానం కీలక కమిటీలను ప్రకటించింది. ఇందులో భాగంగా రాజానగరం మాజీ ఎమ్మెల్యే మరియు ప్రస్తుత సీఎం కార్యక్రమాల సమన్వయకర్త (కేబినెట్ హోదా) పెందుర్తి వెంకటేష్ కు సభా ప్రాంగణ పర్యవేక్షణ కమిటీలో చోటు దక్కింది. రాష్ట్రస్థాయిలో కీలకమైన ఈ కమిటీలో పెందుర్తి వెంకటేష్కు బాధ్యతలు అప్పగించడం పట్ల నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, పెందుర్తి అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నియామకం పట్ల టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ కి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి రాజానగరం నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. జరుగుతున్న ఈ మహానాడులో రాజానగరానికి ఈ అరుదైన గుర్తింపు లభించడం విశేషమని నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లు, తూర్పుగోదావరి జిల్లా ప్రజలు వ్యాఖ్యానించారు.





# మానికొండ -- తరిగొప్పల రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు

**రూ. 2.5 కోట్ల వ్యయంతో పునర్నిర్మాణం కానున్న మానికొండ తరిగొప్పల రహదారి**

**20 రోజుల్లో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్కు ఎమ్మెల్యే ఆదేశం.గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో రోడ్లు దెబ్బతిన్నాయని యార్లగడ్డ విమర్శ**



ఉంగుటూరు, మే 7 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) గత ప్రభుత్వం కారణంగా రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా తయారయ్యిందనీ ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గురువారం ఉంగుటూరు మండలం మానికొండ - తరిగొప్పల మధ్య అత్యంత అధ్వానంగా ఉన్న రహదారిని రూ. 2.5 కోట్ల వ్యయంతో పునర్నిర్మించే పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్లే రాష్ట్రంలోని రహదారులు గుంతలమయంగా మారాయని ఆయన విమర్శించారు. కేవలం సంక్షేమ పథకాల ద్వారా నగదు బదిలీ చేస్తే సరిపోదని, మౌలిక సదుపాయాలు కల్పిస్తేనే రాష్ట్రానికి పరిశ్రమలు వస్తాయని ఆయన స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశ్రామికవేత్తల్లో నమ్మకం పెరిగిందని, తద్వారా రాయల్ ఎన్ఫీల్డ్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులతో ముందుకు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. మానికొండ గ్రామ అభివృద్ధి కోసం మొత్తం రూ. 4.25 కోట్లు కేటాయించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఇందులో భాగంగా మానికొండ - తరిగొప్పల రోడ్డుతో పాటు, గుడివాడ వెళ్లే రహదారి మరమ్మతులకు రూ. 95 లక్షలు, ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 25 లక్షలు, అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ భవనానికి రూ. 5 లక్షలు వెచ్చించనున్నట్లు వివరించారు. సోషల్ మీడియాలో ఈ రహదారి దుస్థితిపై వస్తున్న ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని, కాంట్రాక్టర్ నిర్ణీత 20 రోజుల లోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు. నియోజకవర్గంలోని ప్రతి సమస్య తనకు తెలుసని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రాధాన్యత క్రమంలో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తున్నానని యార్లగడ్డ తెలిపారు. రానున్న ఒకటి రెండు నెలల్లో ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామంలో సిమెంట్ రోడ్ల పనులు కూడా చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. జరుగుతున్న అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఉంగుటూరు మండల ఎంపీడీవో సత్యకుమార్, గన్నవరం ఏయంసి చైర్మన్ గూడవల్లి నరసింహారావు, మండల టిడిపి అధ్యక్షులు కొలుసు రవీంద్ర, ఏయంసి డైరెక్టర్ కొండేటి వెంకటేశ్వరరావు, అరుమళ్ళ కృష్ణారెడ్డి, గొడ్డళ్ల రామారావు, కుందేటి చంద్రశేఖర్, గోగినేని విష్ణు, యడవల్లి సాయిబాబు, షేక్ వలి, షేక్ అజీజ్, షేక్ ఫిరోజ్, అరికట్ల రవికుమార్, బెజవాడ నాగేశ్వరరావు, మేడేపల్లి రమ, తుమ్మల లత, పొట్లూరి భువనేశ్వరి, దాసరి రవళి, చిమట రవివర్మ, బర్మా భాస్కర్, పోతినేని రామకృష్ణ, గరిమెళ్ళ వరప్రసాద్, పోతినేని బాపయ్య చౌదరి, చింతా వాసుబాబు, దోనేపూడి భరత్, పసుపులేటి సుబ్బారావు, తుమ్మల జగదీష్, అనిల్, అట్లూరి నాని, కొసరాజు సాయిరాం, గుండపనేని నాని, దొడ్ల కుమార్, నక్కా వెంకటేశ్వరరావు మరియు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కేరళం ముఖ్యమంత్రి అభ్యర్థిపై కొనసాగుతున్న అనిశ్చితి



తిరువనంతపురం : కేరళంలో ముఖ్యమంత్రి అభ్యర్థిపై అనిశ్చితి కొనసాగుతోంది. ఫలితాలు వెలువడి రెండు రోజులు గడిచినప్పటికీ.. సిఎం అభ్యర్థి ఎవరన్న అంశంపై స్పష్టత వెలువడలేదు. కేరళం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో తన మొదటి శాసనసభ పక్ష సమావేశాన్ని గురువారం తిరువనంతపురంలో నిర్వహించనుంది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి అభ్యర్థిపై చర్చలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వి.డి. సతీసన్, కె. సురేష్, దీప్‌దాస్ మున్షీ సహా పలువురు సీనియర్ నేతలు కాంగ్రెస్ పార్టీ పరిశీలకులైన ముకుల్ వాస్నిక్, అజయ్ మాకెన్‌లను కలిసేందుకు తిరువనంతపురంలోని తాజ్ హోటల్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపి కె.సురేష్ మీడియాతో మాట్లాడారు. ఈ చర్చలు కాంగ్రెస్ హైకమాండ్ ప్రక్రియలో ఒక భాగమని అన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం కాంగ్రెస్‌కు మెజారిటీ వచ్చినా, రాకపోయినా సిఎల్ పి నేతను ఎంపికే చేసేందుకు కాంగ్రెస్ హైకమాండ్ పరిశీలకులను పంపుతుందని అన్నారు. ఇదే ప్రక్రియ కేరళలోనూ చేపట్టనున్నారని అన్నారు. హైకమాండ్ ఇద్దరు అత్యంత సీనియర్ నాయకులను, వర్కింగ్ కమిటీ సభ్యులను పరిశీలకులుగా నియమించిందని అన్నారు. గతంలో కేరళ బాధ్యతలు చేపట్టిన, రాష్ట్ర రాజకీయాలపై అవగాహన ఉన్న సీనియర్ నేత ముకుల్ వాస్నిక్, ప్రస్తుతం ఏఐసీసీ కోశాధికారిగా ఉన్న అజయ్ మాకెన్లను పరిశీలకులుగా నియమించిందని అన్నారు. వారు ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి, ఎమ్మెల్యేలు, ఇతర సీనియర్ నేతలతో చర్చలు జరపనున్నారని అన్నారు. చర్చల అనంతరం హైకమాండ్‌కు ఒక నివేదికను పంపనున్నాని చెప్పారు. ఆ నివేదిక ఆధారంగా, హైకమాండ్ సీనియర్ నాయకులతో చర్చించిన తర్వాత, ముఖ్యమంత్రి అభ్యర్థిపై తగిన నిర్ణయం తీసుకుంటారని అన్నారు. 140 మంది సభ్యులున్న కేరళం అసెంబ్లీలో యుడిఎఫ్ 102 స్థానాలు గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈ కూటమిలో కాంగ్రెస్ 63 స్థానాలను గెలుచుకోగా, దాని మిత్రపక్షమైన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) 22 స్థానాల్లో విజయం సాధించింది.

## నితీష్ కుమార్ కుమారుడు నిశాంత్‌తో సహా 32 మంది మంత్రులు ప్రమాణస్వీకారం



పాట్నా : బీహార్ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరిగింది. ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంలో కొత్తగా జరిగిన మంత్రివర్గంలోకి ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ చోటు దక్కించుకున్నారు. నిశాంత్‌తోపాటు 32 మంది నేడు మంత్రలుగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం పాట్నాలో గాంధీ మైదానంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్, బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, జెడియు అధ్యక్షులు నితీష్‌కుమార్‌తోపాటు పలువురు ఎన్‌డిఎ నేతలు పాల్గొన్నారు. కాగా, కొత్తగా ఏర్పడిన మంత్రివర్గంలో ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరితో సహా బిజెపికి 15 మంత్రి పదవులు, ఇక మిత్రపక్ష పార్టీ జెడియుకి 13 (ఇద్దరు డిప్యూటీ సిఎంలు : బిజేంద్ర ప్రసాద్ యాదవ్, విజయ్ కుమార్ చౌదరి), లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) : ఇద్దరు, హిందుస్తానీ ఆవామ్ మోర్చా (సెక్యులర్) : ఒకరు, రాష్ట్రీయ లోక్ మోర్చా నుండి ఒకరు మంత్రులుగా గురువారం ప్రమాణం చేశారు. మంత్రివర్గంలో ఓబిసి, ఇబిసి, హిందువులు, దళితులు, మహిళలు ఇలా వివిధ సామాజిక వర్గాలకు చెందినవారికి కేబినెట్‌లో స్థానం కల్పించారు. ప్రస్తుతం మంత్రివర్గంలో ముఖ్యమంత్రి, ఇద్దరు ఉపముఖ్యమంత్రులతో 35 మందితో కూడిన మంత్రివర్గం ఉంది. 243 అసెంబ్లీ స్థానాలున్న అసెంబ్లీకి గరిష్టంగా 36 మంది మంత్రలు ఉండవచ్చు. తాజాగా ఏర్పడిన కొత్త కేబినెట్‌లోకి మాజీ సిఎం నితీష్‌కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ (జెడియు, శ్వేతా గుప్తా (జెడియు) మిథిలేష్ తివారి (బిజెపి), శైలేష్ కుమార్ (జెడియు)లతో పాటు పలువురు కొత్త కేబినెట్‌లో మంత్రలుగా ప్రమాణస్వీకారం చేశారు.

## తేలని తమిళనాడు

### గవర్నర్ ను మరోసారి కలిసిన విజయ్



చెన్నై: తమిళనాడులో తమిళ వెట్రి కజగం (టీవీకే) అధినేత విజయ్ మరోసారి లోక్ భవన్ లో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ను కలిశారు. టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ మద్దతు లేఖ, 20 మంది మద్దతు మంత్రుల జాబితాను గవర్నర్ కు అందించారు. సింగిల్ లార్జెస్ట్ పార్టీగా ఉన్నామని లేఖను కూడా అందించారు. సంఖ్యా బలం నిరూపించుకున్న తరువాతే ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇస్తామని గవర్నర్ స్పష్టం చేశారు. ఈ క్రమంలో గవర్నర్ నుండి పలు ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. 40నిమిషాల సమావేశం అనంతరం విజయ్ లోక్ భవనము నుండి వెళ్లిపోయారు. అనంతరం గవర్నర్ కార్యాలయం నుండి టీవీకేకు ఫోన్ కాల్ వచ్చిన్నట్లు మీడియాలో సమాచారం. విజయ్ సమర్పించిన సంఖ్యా బలం పట్ల గవర్నర్ అసంతృప్తి వ్యక్తం చేశారని సమాచారం. 118 మంది మెజారిటీ సభ్యుల జాబితాను సమర్పించాలని గవర్నర్ కార్యాలయం టీవీకేకు స్పష్టం చేసిందని మీడియాలో పేర్కొన్నారు.

## బెంగాల్ పీఠంపై కూర్చునేది ఎవరు?

### సువేందు , అగ్నిమిత్ర పాల్ , రూపా గంగూలీ , దిలీప్ ఘోష్
### సువేందు అధికారికి అత్యధిక అవకాశాలు
### రాష్ట్ర బీజేపీ చీఫ్ సమిక్ భట్టాచార్య పేరూ పరిశీలనలో
### అగ్నిమిత్రపాల్ తదితరులూ పోటీలో..

కమ్యూనిస్టుల కంచుకోటలను బద్దలుకొట్టి 15ఏళ్లు ఏకఛత్రాధిపత్యంగా పశ్చిమబెంగాల్‌ను ఏలిన మమతాబెనర్జీని ఘోరంగా ఓడించి ఇంటికి సాగనంపిన కమలనాథుల్లో ఎవరు రాష్ట్ర ముఖ్యమంత్రి కుర్చీలో ఆసీనులవుతారనే ప్రశ్న తలెత్తింది. ఆ కుర్చీకి తామే అర్హులమంటూ రాష్ట్ర ముఖ్యనేతలు బీజేపీ అధిష్టానం వద్ద వాదనలు గట్టిగా విన్పిస్తున్నారు. వీరి వాదనల్లో ఎవరి వాదనకు అగ్రనేతలు మోదీ, అమిత్‌షా ద్వయం సమ్మతి తెలుపుతుందో త్వరలో తేలిపోనుంది. అయితే మమతను ఒంటిచేత్తో మట్టికరిపించిన రాష్ట్ర రాజకీయ దురంధరుడిగా ఘనత సాధించిన సువేందు అధికారికే సీఎం పీఠం దక్కే అవకాశముందని ఊహాగానాలు ఎక్కువయ్యాయి. అయితే గుజరాత్ మొదలు మధ్యప్రదేశ్, హరియాణా, ఉత్తర ప్రదేశ్‌దాకా ప్రతిసారీ కొత్త ముఖాలకు అవకాశమిచ్?చన బీజేపీ అధిష్టానం ఈసారి పశ్చిమబెంగాల్‌లోనూ కొత్త వారికి ఛాన్స్ ఇచ్చే ఆస్కారముందనే వాదనా తెరమీదకొచ్?చంది. ఈ నేపథ్యంలో ఐదారుమంది నేతల పేర్లు ప్రముఖంగా విన్పిస్తున్నాయి. వారి గురించి క్లుప్తంగా..

### సువేందు అధికారి..

బెంగాల్‌లో అత్యధిక మందికి చిరపరిచితమైన నేత. గతంలో మమతాబెనర్జీకి కుడిభుజంగా ఉంటూ నందిగ్రామ్‌లో రైతు ఉద్యమాన్ని ముందుకు నడిపించిన నేత తర్వాత టీఎంసీకి తిలోదకాలిచ్చి కమలదళంలో చేరి కీలక నేతగా ఎదిగారు. గతంలో నందిగ్రామ్‌లో మమతను ఓడించి ఈసారి భవానీపూర్‌లోనూ మమతకు ఓటమి రుచిచూపించారు. క్షేత్రస్థాయిలోనూ పార్టీపై పట్టుసాధించిన సువేందుకు సీఎం అయ్యే అవకాశాలు మిగతావారికంటే మెరుగ్గా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే నారదా స్టింగ్ ఆపరేషన్ ఉదంతంలో లంచం తీసుకుంటూ కెమెరా కంటికి చిక్కి పరువుపోగొట్టుకున్నారు.



### సమిక్ భట్టాచార్య

ఆర్‌ఎస్‌ఎస్ మూలాలున్న భట్టాచార్య ఇటీవలే పశ్చిమబెంగాల్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సేవలు ఆరంభించారు. ఎన్నికల్లో అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించారు. అగ్రనేతల సుడిగాలి పర్యటనలను సమన్వయంచేసుకుంటూనే సొంతంగా పలు ప్రచారకార్యక్రమాల్లో పాల్గొని టీఎంసీపై పదునైన విమర్శనాస్త్రాలు సంధించి ప్రజల్లో గుర్తింపుపొందారు. పార్టీలో నేతలను ఏకతాటి మీదకు తీసుకురావడంలో దిట్టగా పేరొందారు. కులమతాలకతీతంగా అన్ని వర్గాల్లోనూ పార్టీని విస్తరింపజేసే సత్తా ఈయనకు ఉందని అగ్రనాయకత్వంలోనూ ఈయన మంచిపేరు సంపాదించారు. ఈయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందనే మాటా విన్పిస్తోంది.

### అగ్నిమిత్ర పాల్

గతంలో వృత్తిరీత్యా ఈమె ఒక ఫ్యాషన్ డిజైనర్. బెంగాల్‌లో ముందంజలో ఉండి పార్టీని నడిపించే క్రియాశీలక మహిళా నేతల్లో ఈమె కూడా ఒకరు. బీజేపీ మహిళా మోర్చాకు గతంలో అధ్యక్షురాలిగా సేవలందించారు. తర్వాత రాష్ట్ర ఉపాధ్యక్షురాలి స్థాయికి ఎదిగారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో అసన్‌సోల్ నుంచి మరోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ నుంచి గతంలో పట్టభద్రురాలైన ఈమె తరచూ మమతా బెనర్జీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

### రూపా గంగూలీ

దిగ్గజ నిర్మాత, స్క్రీన్‌రచయిత బీఆర్ చోప్రా తెరకెక్కించిన అద్భుత సీరియల్ 'మహాభారత్'లో ద్రౌపది పాత్రతో యావత్ భారతానికి చిరపరిచితమైన నటి రూపా గంగూలీ. బీజేపీ రాజ్యసభ సభ్యురాలిగా పశ్చిమ బెంగాల్ ప్రజలకు ఎంతో దగ్గరయ్యారు. తర్వాత సోనానూర్ దక్షిణ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది నియోజకవర్గంలో ఓటర్లకు అందుబాటులో ఉంటూ మంచి పేరుతెచ్చుకున్నారు. బెంగాల్ బీజేపీ మహిళా మోర్చాకు అధ్యక్షురాలిగా రెండేళ్లు సేవలందించారు. ఆకాలంలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

### దిలీప్ ఘోష్

బీజేపీ ఫైర్‌బ్రాండ్‌గా పేరొందారు. గతంలోనే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సేవలందించారు. 2021లో పార్టీ టీఎంసీకి గట్టిపోటీ ఇవ్వడంలో సఫలీకృతమయ్యారు. ఆనాడు రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమంటే వామపక్షలు, కాంగ్రెస్ కాదు అని బీజేపీయే ప్రజల పక్షాన పోరాడుతోందని నిరూపించే ప్రయత్నంచేశారు. తక్కువకాలంపాటే బీజేపీ రాష్ట్ర శాఖ చీఫ్‌గా కొనసాగినా వ్యవహారాలను చక్కబెట్టడంలో తనదైన ముద్రవేశారు. సీఎం రేసులో తానూ ముందంజలో ఉన్నానని నిరూపించుకున్నారు. గతంలో ఆర్‌ఎస్‌ఎస్‌లో పనిచేశారు. 12 సంవత్సరాల క్రితం బీజేపీలో చేరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కష్టపడిపనిచేసి త్వరగానే రాష్ట్ర చీఫ్ స్థాయికి ఎదిగారు. అయితే వాచాలత్వంతో తరచూ వివాదాస్పద వ్యాఖ్యానాలుచేస్తూ అప్రతిష్ట తెచ్చుకోవడం ఈయనకు రివాజుగా మారింది. అయినాసరే రాజకీయ చతురతతో నెగ్గుకురాగల సమర్థుడని ఆయనకుపేరుంది. సువేందుకు ఈయన ఒక్కరే గట్టిపోటీ ఇచ్చే అవకాశముంది.

## అమ్మకు రెండు తరాల బరువు

కూతురి కాలేజ్ ఫీజు ఒకవైపు... మామగారికి పక్షవాతం మరోవైపు... 50 దాటిన మహిళలు ఇలా ఒకేసారి రెండు తరాల మధ్య స్ట్రెస్ అనుభవిస్తున్నారు. దీనినే 'శాండ్‌విచ్ జనరేషన్ స్ట్రెస్' అంటారు. భర్తతో అడ్జస్ట్ అవడం, మెనోపాజ్ సమస్యలు ఇందుకు అదనం. ఒక సర్వే ప్రకారం అర్బన్ ఇండియాలో 35 శాతం మహిళలు ఇలా పిల్లలూ పెద్దల మధ్య నలుగుతున్నారు. ఇలాంటి స్థితిలో ఉన్న ఒక అమ్మ ఏం చేసింది? ఆమెలాంటి అమ్మను మనం చాలామందిని చూసి ఉంటాం. వయసు 49 ఏళ్లు. హైదరాబాద్‌లో స్కూల్ అడ్మిన్‌గా ఉద్యోగం. మధ్యతరగతి జీవితం. ఈమె చన్నీళ్లకు భర్త సంపాదన వేణ్ణీళ్లు. ఇద్దరూ సంపాదించకపోతే బండి నడవదు. ఆమె పని ఉదయం ఏడుకే మొదలైపోతుంది. గిన్నెలు, టిఫిన్ వండటాలు... చేయదగ్గవే. కాని అత్తగారిని చూసుకోవాలి. డెబ్బై అయిదేళ్ల అత్తగారికి డైపర్ మార్చడం, మందులు వేయడం, టిఫిన్ తినేలా చూసి ఆ తర్వాత లంచ్ బాక్స్ రెడీ చేసుకొని ఆఫీసుకు పరుగు పెట్టడం... ఒకరోజు కాదు రెండు రోజులు కాదు... నిత్యం. ఆఫీసులో ఉండగా కూతురి ఫోన్ వస్తుంది. కాలేజీ ఫీజు గురించి. కొడుకు ఫోన్ వస్తుంది... దొరకని ఉద్యోగం గురించి... చేరాల్సిన కోర్సు గురించి. ఆఫీసులో బాసు పని మీద పని చెప్తుంటాడు. అలిసి సాయంత్రం ఇంటికి వచ్చాక మళ్లీ డ్యూటీ. అత్తగారికి డిన్నర్, కూతురికి కౌన్సెలింగ్, కొడుకుకి మోటివేషన్. రాత్రి పదకొండుకు మంచం మీద వాలితే ఆమెకు కలిగే భావన ఏమిటి?




### ఆమెలో మార్పులు

రోజులు గడిచే కొద్దీ ఆమెలో మార్పులు వచ్చాయి. అవి ఆమె అదుపులో లేవు. ఏమిటవి? ఎవరిని చూసినా కోపం రావడం. అత్తగారు మంచం తడిపితే అరిచేసి తర్వాత గిల్టీ ఫీల్ అయ్యి ఏడవడం. రోజురోజుకూ ఖర్చులు పెరిగి ఇప్పుడే రూపాయి మిగలకపోతే నాకు అరవై వచ్చేసరికి ఏం మిగులుతుంది అనే ఆందోళన. అద్దంలో చూసుకుంటే తనకు తానే గుర్తు పట్టని రూపం. మెనోపాజ్ చికాకు, నడుము నొప్పి, బి.పి... ఒకరోజు ఆఫీస్‌లో కళు తిరిగి పడిపోయింది. డాక్టర్ ఆమె సంగతి అంతా గ్రహించి 'మీరు ఇప్పుడు మారకపోతే, మీ అత్తగారి పక్క బెడ్ మీదే మీరుంటారు' అన్నాడు. 'మీకూ జీవితం ఉండాలి. మీరు అమ్మగా మాత్రమే బతుకుతున్నారు' అన్నాడు.

### మొదలైన మార్పు

డాక్టర్ మాటతో ఆమెలో ఆలోచన రేగింది. ఒక స్నేహితురాలి సహాయంతో ఒక సైకాలజీ కౌన్సిలర్‌తో మాట్లాడింది. 'శాండ్‌విచ్ జనరేషన్ స్ట్రెస్' గురించి కొంత క్లారిటీ తెచ్చుకుంది. కొన్ని మార్పులు చేసుకుంది. జీవితం అంటే తనకు తాను మిగిలేలా బతకడం అనే ఎరుక తెచ్చుకుంది. ఈ అమ్మ మరి ఏం చేసింది?

### 'సూపర్ ఉమన్' టైటిల్ వదిలేసింది

కుటుంబ సభ్యులతో మీటింగ్ పెట్టి భర్త, కొడుకుతో ఖచ్చితంగా చెప్పింది-- 'నేను ఒక్కదాన్నే చేయలేను. మీరు కూడా చేయాలి'. ఇప్పుడు ఉదయం అత్తగారి మందులు భర్త బాధ్యత. సాయంత్రం భోజనం కొడుకు పెడతాడు. డైపర్ మార్చే పనిలో కూతురు సాయం పడుతుంది. సాయం అడగడం బలహీనత కాదు, తెలివి అని ఆమెకు అర్థమైంది.

### తనకంటూ రెండు రోజులు

నెలకు రెండు రోజులు... అంటే ఆదివారాలు తను పూర్తి విశ్రాంతి తీసుకోదలిచింది. ఆ రెండురోజుల కోసం ఒక హోమ్ నర్స్‌ను అత్తగారి కోసం ఏర్పాటు చేస్తుంది. అలాగే వంట పూర్తిగా బంద్ చేసి పిల్లలు చేసేదో బయటి నుంచి తెచ్చేదో ఉండాలంటోంది. ఆ రెండు రోజులు సినిమా, నిద్ర, ఫ్రెండ్స్‌తో కబుర్లు. ఆ రెండు రోజుల బలంతో మిగిలిన 28 రోజులు లాగించగలుగుతోంది.

### ఆర్థిక బరువు తగ్గించి

కూతురితో స్పష్టంగా చెప్పింది-- 'ఈ సెమిస్టర్ ఫీజు కడతాను. నెక్స్ట్ సెమిస్టర్ నుంచి ఎడ్యుకేషన్ లోన్ తీసుకో. నా రిటైర్మెంట్ ఫండ్ ఖాళీ అయితే, రేపు నేను మీ మీద భారం అవుతాను'. కొడుక్కి కూడా కోర్సులు చేరాలంటే పార్ట్‌టైమ్ చేసి సంపాదించు అని.

### తన సమయం-- 'మీ' టైమ్

రోజులో తన సమయం కొంత ఉండాలనుకుంది. ప్రతిరోజూ ఉదయం కాసేపు టెర్రస్ మీద నిలబడి కాఫీ తాగుతుంది. ఆ టైమ్‌లో చేతిలో ఫోన్ ఉండకూడదు, వేరే ఆలోచనలు ఉండకూడదు. అలాగే సాయంత్రం డిన్నర్ తర్వాత కాసేపు పచార్లకు సమయం. 6 నెలల తర్వాత ఆమె బి.పి. కంట్రోల్‌లోకి వచ్చింది. అందరూ దారికి వచ్చారు. నేను నా జీవితాన్ని కాపాడుకున్నాను అనుకుంది ఆ అమ్మ. కాదు మహిళ. కాదు కాదు ఒక జీవని.

## నిప్పు-నీరు కలిసే చాన్సే లేదా?



అధికారం అయితే నీది లేదంటే నాది.. ద్రవిడ సిద్ధాంతం ఆధారంగా నడిచే తమిళనాడు రాజకీయాల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న తంతు ఇదే . అయితే ఈసారి విజయ్ అనే రూపంలో 'మార్పు' ఆ రెండు పార్టీల ఓటు బ్యాంకును గట్టిగా దెబ్బ కొట్టింది. వాటిని పక్కన నెట్టేసి అధికారం ఏర్పాటు దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇలాంటి పరిస్థితుల్లోనైనా వైరాన్ని పక్కన పెట్టి డీఎంకే--అన్నాడీఎంకేలు చేతులు కలుపుతాయా?.. డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు రహస్య చర్చలు జరుపుతున్నాయి. ఈ రెండూ కలిసి అధికారం ఏర్పాటు చేయబోతున్నాయి. తద్వారా అత్యధిక స్థానాలు గెల్చుకున్న విజయ్‌కు భారీ షాక్ తగలబోతోంది. అదే టైంలో.. ఒక దెబ్బకు రెండు పిట్టలు అన్నచందాన తమను ఇంతకాలం అవసరానికి వాడుకున్న జాతీయ పార్టీలనూ దెబ్బ కొట్టబోతున్నాయి. ఇది నిన్న సాయంత్రం నుంచి తమిళనాట జరుగుతున్న ప్రచారం. అయితే అటు డీఎంకే, ఇటు అన్నాడీఎంకే రెండూ ఈ ప్రచారాన్ని కొట్టిపారేశాయి. ఇది టీవీకే ఆడుతున్న చిల్లర మైండ్‌గేమ్ అని తిట్టిపోశాయి. రాజకీయాల్లో ఏదైనా సాధ్యమనే మాట ఒకటి ఉంది. అలాంటప్పుడు డీఎంకే-అన్నాడీఎంకే.. ఈ పార్టీల మధ్య స్నేహం ఎందుకు అసాధ్యం?. తమిళ రాజకీయాల పేజీలను తిరగేస్తే.. ఏనాడూ ఈ పార్టీలు జట్టు కట్టిన సందర్భం కనిపించదు. స్థానిక ఎన్నికల దగ్గరి నుంచి ఎందులో అయినా సరే మద్దతు అనేది భూతద్దం పెట్టి వెతికినా కనిపించదు. కేవలం ద్రవిడ ఉద్యమ వారసత్వం, తమిళ భాషా హక్కుల అంశాల్లో రెండు పార్టీలూ ఒకే వేదికను పంచుకోవడం తప్పించి. ఈ రెండు పార్టీలు కలవకపోవడానికి ప్రధానంగా మూడు బలమైన కారణాలు కనిపిస్తాయి

### పుట్టుకే..

1972లో కరుణానిధి నాయకత్వంలోని డీఎంకే నుంచి ఎంజీ రామచంద్రన్ బహిష్కరించింది. ఆ అవమానానికి ప్రతీకారంగా ఎంజీఆర్ అన్నాడీఎంకే స్థాపించారు. కొత్త పార్టీ ప్రకటన సమయంలో.. డీఎంకేలో అవినీతి పెరిగిపోయిందని సంచలన ఆరోపణలు చేశారాయన. నాటి నుంచి నేటి దాకా.. ఒక పార్టీ ఉనికి మరొక పార్టీని వ్యతిరేకించడం మీదనే ఆధారపడి ఉంది. ఒకవేళ ఈ రెండూ కలిస్తే, అవి తమ మౌలిక సిద్ధాంతాన్ని తామే తుడిచేసుకున్నట్లు అవుతుంది.

### భిన్న ధృవాల రాజకీయం

గత 50 ఏళ్లుగా తమిళ ప్రజలకు ఈ రెండు పార్టీలే ప్రత్యామ్నాయాలు. డీఎంకే పాలన నచ్చకపోతే అ?న్నాడీఎంకేకి.. అది నచ్చకపోతే మళ్ళీ డీఎంకేకు ఓటు వేస్తూ అధికారం కట్టబెట్టుకుంటూ వస్తున్నారు. ఒకవేళ ఈ రెండు పార్టీలు పొత్తు పెట్టుకుంటే.. అప్పటివరకు ఈ రెండు పక్షాల మధ్య చీలి ఉన్న 70-80 శాతం ఓటు బ్యాంకు గందరగోళానికి గురవుతుంది. ఇది మూడవ శక్తికి (తాజాగా విజయ్ నేతృత్వంలోని టీవీకే వంటి పార్టీలకు) రెడ్ కార్పెట్ పరిచినట్లు అవుతుంది. తమ ఓటు బ్యాంకును కాపాడుకోవడానికే ఇవి ఎప్పుడూ ప్రత్యర్థులుగానే ఉండాలని కోరుకుంటాయి.

### కేడర్ స్థాయి ఘర్షణ

దశాబ్దాలుగా కొనసాగుతున్న వైరంలో.. కేవలం నాయకులే కాదు, క్షేత్రస్థాయి కార్యకర్తలు కూడా భాగస్వాములు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రతి చోటా ఈ రెండు పార్టీల నాయకుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. గత ఐదు దశాబ్దాలుగా ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకుంటూ, ఒకరినొకరు విమర్శించుకుంటూ.. దాడులు చేసుకుంటూ..ఆఖరికి హత్యలు కూడా చేసుకుంటూ వస్తున్నారు. పెరిగిన క్యాడర్, అకస్మాత్తుగా పొత్తు పెట్టుకుంటే దానిని అంగీకరించడం అసాధ్యం. నాయకులు పైన కలిసినా, కింద కార్యకర్తలు కలవడం కష్టమైన పని.

### మరి జాతీయ పార్టీలతో జట్టు?..

తమిళ గడ్డపై ఎట్టి పరిస్థితుల్లో మత శక్తులకు చోటు ఉండకూడదు.. అనేది ద్రవిడ సిద్ధాంత ప్రాథమిక సూత్రం. అయినప్పటికీ డీఎంకే, అన్నాడీఎంకేలు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలతో పొత్తులు పెట్టుకుంటాయి. ఎందుకనేది పరిశీలిస్తే..

### ఢిల్లీలో పట్టు కోసం

తమిళనాడులో ఈ రెండు పార్టీలు ఎంత బలంగా ఉన్నా.. జాతీయ రాజకీయాల్లో ప్రభావం చూపడం కూడా ఎంతో అవసరం. కేంద్రంలో చట్టాలు చేయాలన్నా లేదంటే రాష్ట్రానికి నిధులు రావాలన్నా జాతీయ పార్టీల మద్దతు అవసరం. పైగా కేంద్రంలో అధికారంలో ఉండే పార్టీతో పొత్తు పెట్టుకుంటే.. కేంద్ర క్యాబినెట్‌లో తమ ఎంపీలకు మంత్రి పదవులు దక్కుతాయి. తద్వారా రాష్ట్ర సమస్యలపై ఢిల్లీలో ఒత్తిడి తీసుకురావచ్చనేది ఒక లెక్క.

### విడదీసి పాలించడం

తమిళనాడులో కాంగ్రెస్‌కు, బీజేపీకి సొంతంగా గెలిచే సత్తా తక్కువ (సుమారు 5% నుండి 10% ఓటు బ్యాంకు మాత్రమే ఉంది). ఈ చిన్న ఓటు బ్యాంకు కూడా మూడో పార్టీకి వెళ్తే తమకు నష్టం జరుగుతుందని ద్రవిడ పార్టీలు భయపడతాయి. అందుకే, ఆ జాతీయ పార్టీని తమ వైపు తిప్పుకోవడం ద్వారా ప్రత్యర్థిని బలహీనపరచడం వీరి వ్యూహం.

### సిద్ధాంతం జం అధికారం

ద్రవిడ సిద్ధాంతం ప్రకారం మతతత్వానికి వ్యతిరేకంగా ఉండాలి. కానీ ఎన్నికల రాజకీయాల్లో 'గెలవడమే' ముఖ్యం. సాధారణంగా "సెక్యులరిజం" పేరుతో డీఎంకే కాంగ్రెస్‌తో జతకడుతుంది. అదే సమయంలో బీజేపీని "మతతత్వ పార్టీ" అని విమర్శిస్తూ ద్రవిడ ఓటర్లను ఆకట్టుకుంటుంది. అయితే.. జయలలిత ఉన్నప్పుడు హిందూ ఓటర్లను ఆకట్టుకోవడానికి కొన్నిసార్లు బీజేపీతో సాఫ్ట్‌గా ఉండేవారు. అదే ఆ తర్వాతి కాలంలో ఎన్డీయే పొత్తునకు కారణమైంది. అయితే అది కేవలం రాజకీయ అవసరం కోసమే తప్ప సిద్ధాంతపరంగా కాదు. అందుకే ఈ రెండు పార్టీలు ఏ క్షణమైనా జాతీయ పార్టీలతో బంధాన్ని తెంచుకునేందుకు సిద్ధంగా ఉంటాయి.


### విజయ్ రాకతో సీన్ మారేనా?

2026 అసెంబ్లీ ఎన్నికలు తమిళనాడుకు మునుపెన్నడూ లేని రీతిలో ఆసక్తికర రాజకీయం అందించాయి. అగ్రనటుడు విజయ్ రెండేళ్ల కిందట స్థాపించిన టీవీకే తొలి ఎన్నికల్లోనే అత్యధిక స్థానాలు గెలుచుకోగా.. డీఎంకే అధికారం కోల్పోయి రెండో స్థానంలోకి, ప్రతిపక్ష అన్నాడీఎంకే మూడో ప్లేస్‌లోకి పడిపోయాయి. తమిళనాట హంగ్ ఏర్పడటంతో.. ప్రభుత్వ ఏర్పాటులో టీవీకే (ఎఖ) పార్టీని అడ్డుకోవడానికైనా ఈ రెండు పార్టీలు కలుస్తాయేమోనని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే.. తమ 50 ఏళ్ల సిద్ధాంత పోరాటాన్ని ఒక్క ఎన్నిక కోసం వదులుకోవడానికి వారు సిద్ధంగా ఉన్నారా? అన్నదే ఇక్కడ అసలు ప్రశ్న.

### ఇదే అసలు సమస్య..

నాయకత్వ అహంకారం-పట్టుదల ఈ రెండు పార్టీలకు ఇప్పటికీ కొనసాగుతున్న ఓ కామన్ గుణం. జనతా సర్కార్ ఉన్న టైంలో.. ఇందిరా గాంధీని దెబ్బ కొట్టడానికి ఈ తమిళ శక్తులను ఒక్కటి చేసే ప్రయత్నం జరిగింది. కానీ, చివరి నిమిషంలో ఆ ప్రయత్నం ఎందుకనో ఫలించలేదు. ఎంజీఆర్ తదనంతరం జయలలిత అన్నాడీఎంకే పగ్గాలు చేపట్టారు. అయితే కరుణానిధి-జయలలిత ఉన్న కాలంలో ఈ వైరం వ్యక్తిగత స్థాయికి చేరింది. అది ఎంతలా అంటే.. 1989 మార్చి 25న తమిళనాడు అసెంబ్లీలో జయలలిత పట్ల జరిగిన అవమానం(ఆమె చీరను లాగడం..), 75 ఏళ్ల వయసులో కరుణానిధిని అర్ధరాత్రి పూట ఇంట్లోంచి లాక్కొచ్చి మరీ జయ సర్కార్ అరెస్ట్ చేయించడం.. ఇలాంటి సంఘటనలు ఈ రెండు పార్టీల మధ్య స్నేహపూర్వక చర్చలు అనే దారులు పూర్తిగా మూసివేశాయి. బద్ధ శత్రువులుగా మారిపోయాయి. ఆ తర్వాతి కాలంలో.. ఆ పార్టీల అధినేతలుగా స్టాలిన్, ఎడప్పాడి పళనిస్వామి కూడా అదే పంథాను అనుసరిస్తున్నారు. ఈ ఇద్దరిలో ఒకరి కింద మరొకరు పని చేయడానికి ఏ నాయకుడూ సిద్ధపడరు. ముఖ్యమంత్రి పదవి విషయంలో రాజీ పడటం అనేది ద్రావిడ రాజకీయాల్లో దాదాపు అసాధ్యమైన విషయం. తమిళనాడు రాజకీయ చరిత్రలో డీఎంకే, డీఎంకే పార్టీల మధ్య ఉన్న వైరం కేవలం అధికార పోరాటం మాత్రమే కాదు. అది ఒక చారిత్రక భావోద్వేగ ఘర్షణ. అందుకే నిప్పు నీరు కలవడం అసాధ్యమనే చెప్పచ్చు. ఒకవేళ కలిసే ప్రయత్నాలు జరిగితే.. ఆ క్షణమే ద్రావిడ రాజకీయాల అస్తిత్వం దెబ్బతింటుందని వారి నమ్మకం. అందుకే వారు 'మొండిగా' విడివిడిగానే పోరాడతారు తప్ప, చేతులు కలపరు.

# కోడింగ్ ఒక్కటే సరిపోదు!



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్తులో విద్యార్థులు, యువ నిపుణులు ఏయే నైపుణ్యాలపై దృష్టి పెట్టాలనే అంశంపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో చిప్ తయారీ దిగ్గజం ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ చేసిన వ్యాఖ్యలు సాంకేతిక ప్రపంచంలో చర్చకు దారితీశాయి. ఒకవేళ తాను ఇప్పుడు విద్యార్థిని అయితే కోడింగ్‌తో పాటు భౌతిక శాస్త్రానికి (ఫిజిక్స్) అత్యధిక ప్రాధాన్యతనిస్తానని ఆయన స్పష్టం చేశారు.

### కోడింగ్ మాత్రమే సరిపోదు

సాంకేతిక రంగంలో దశాబ్దాలుగా కోడింగ్‌ను అత్యంత కీలకమైన నైపుణ్యంగా పరిగణిస్తున్నారు. అయితే, ఏఐ వ్యవస్థలు కేవలం డిజిటల్ డేటాను ప్రాసెస్ చేసే స్థాయి నుంచి భౌతిక ప్రపంచంతో నేరుగా కార్యకలాపాలు సాగించే స్థాయికి చేరుకుంటున్నాయని హువాంగ్ అభిప్రాయపడ్డారు. 'ప్రస్తుత పరిస్థితుల్లో నేను బహుశా భౌతిక శాస్త్రాన్ని అధ్యయనం చేసేవాడిని' అని పేర్కొన్న హువాంగ్, ప్రపంచం ఎలా పనిచేస్తుందో తెలిపే ప్రాథమిక సూత్రాలను అర్థం చేసుకోవడం కోడింగ్ చేయడం కంటే ముఖ్యమని ఉద్ఘాటించారు. తదుపరి తరం ఆవిష్కరణలు కేవలం సాఫ్ట్‌వేర్ నైపుణ్యాల మీద కాకుండా భౌతిక శాస్త్రం, గణితంపై ఉన్న లోతైన అవగాహన మీద ఆధారపడి ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

### ఎందుకు ఈ మార్పు?

ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగం 'ఫిజికల్ ఏఐ' దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ఏఐ వ్యవస్థలు ఇప్పుడు రోబోటిక్స్, ఆటోమేషన్ వంటి రియల్ వరల్డ్ అప్లికేషన్లలో కీలకంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో హువాంగ్ చెప్పిన దాని ప్రకారం భవిష్యత్తులో డెవలపర్లు, ఇంజినీర్లకు ఫిజిక్స్ విషయాలపై అవగాహన తప్పనిసరి. కోడింగ్ అనేది ఒక పనిని చేయించడానికి ఉపయోగపడే సాధనం మాత్రమేనని, కానీ యంత్రాలు సురక్షితంగా, సమర్థవంతంగా పనిచేయాలంటే అవి పనిచేసే భౌతిక ప్రపంచంపై పూర్తి అవగాహన ఉండాలని ఆయన నొక్కి చెప్పారు.

# స్పేస్‌ఎక్స్‌తో ఆంత్రోపిక్ మెగా డీల్!




కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రముఖ ఏఐ స్టార్టప్ ఆంత్రోపిక్, ఎలాన్ మస్క్‌కు చెందిన అంతరిక్ష పరిశోధనా సంస్థ స్పేస్‌ఎక్స్‌తో భారీ డేటా సెంటర్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. తమ క్లాడ్ ఏఐ సేవలకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకోవడానికి అవసరమైన కంప్యూటింగ్ శక్తిని పొందే లక్ష్యంతో ఆంత్రోపిక్ ఈ నిర్ణయం తీసుకుంది.

కొలోసస్ 1

ఈ ఒప్పందం ప్రకారం, టెన్నెసీలోని మెంఫిస్‌లో ఉన్న స్పేస్‌ఎక్స్ 'కొలోసస్ 1' డేటా సెంటర్ పూర్తి కంప్యూటింగ్ సామర్థ్యాన్ని ఇకపై ఆంత్రోపిక్ వినియోగించుకోనుంది. వాస్తవానికి ఈ కేంద్రాన్ని మస్క్ తన సొంత ఏఐ సంస్థ ఎక్స్‌ఏఐ కోసం నిర్మించారు. కానీ తాజా పరిణామాల నేపథ్యంలో ఇది ఆంత్రోపిక్ చేతుల్లోకి వెళ్తోంది. ఇది 2,20,000 ఎన్విడియా ఏఐ చిప్‌ల మద్దతుతో, దాదాపు 300 మెగావాట్ల కంటే ఎక్కువ విద్యుత్ సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ పనిచేస్తుంది. ఈ డేటా సెంటర్ వల్ల క్లాడ్ ప్రో, క్లాడ్ మాక్స్ చందాదారులకు వేగవంతమైన సేవలు అందనున్నాయి. సాఫ్ట్‌వేర్ రాయడం, ఎడిటింగ్, డీబగ్గింగ్ చేయగల క్లాడ్ కోడ్ పరిమితులను కంపెనీ రెట్టింపు చేసింది. ఇకపై బిజీ సమయాల్లోనూ ఎటువంటి అంతరాయం లేకుండా యూజర్లు దీనిని వాడుకోవచ్చు.


### శత్రువుల మధ్య స్నేహం

ఈ ఒప్పందం టెక్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. గతంలో ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోదీపై, ఆ సంస్థ సిద్ధాంతాలపై మస్క్ తీవ్ర విమర్శలు చేశారు. ఆంత్రోపిక్ సంస్థ పాశ్చాత్య నాగరికతను ద్వేషిస్తుందని, అది ఒక కపట సంస్థ అని గత ఫిబ్రవరిలో మస్క్ ఎక్స్ వేదికగా దుమ్మెత్తిపోశారు. అయితే, తాజాగా చేసిన మస్క్ పోస్ట్ భిన్నంగా ఉంది. 'గత వారం ఆంత్రోపిక్ సీఈఓ, తమ సిబ్బందితో సమయం గడిపాను. వారి సామర్థ్యం చూసి ముచ్చటేసింది. వారు సరైన పని చేయడంపై చాలా శ్రద్ధ వహిస్తున్నారు' అని ప్రశంసించారు. మరో కీలక ప్రకటన చేస్తూ, ఎక్స్‌ఏఐని స్వతంత్ర సంస్థగా రద్దు చేస్తున్నానని ఇకపై అది స్పేస్‌ఎక్స్ ఏఐగా మాత్రమే కొనసాగుతుందని స్పష్టం చేశారు.

### వివాదాల కేంద్రంగా మెంఫిస్ డేటా సెంటర్

ఈ ఒప్పందంలో భాగమైన మెంఫిస్ డేటా సెంటర్ ప్రస్తుతం వివాదాల్లో ఉంది. భారీ స్థాయిలో సహజ వాయువును మండించే టర్బైన్లను ఇక్కడ ఏర్పాటు చేయడం వల్ల వాయు కాలుష్యం పెరుగుతోందని పౌర హక్కుల సంఘాలు నిరసన తెలుపుతున్నాయి. ఫెడరల్ అనుమతులు లేకుండానే వీటిని నడుపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# అదుపుతప్పిన రోబో.. భయపడ్డ విద్యార్థులు



చైనాలోని జిన్‌జియాంగ్ ఉయ్ఘర్ అటానమస్ రీజియన్‌లోని ఒక పాఠశాలలో క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒక రోబో అదుపుతప్పి.. విద్యార్థులను భయభ్రాంతులకు గురించి చేసింది. దీనికి సంబంధించిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విద్యార్థులను అలరించడానికి ఏర్పాటు చేసిన రోబో అకస్మాత్తుగా కిందపడి పోయింది. ఆ తరువాత అక్కడున్న ప్రదర్శనకారులపై కుంగ్-ఫూ కిక్‌లు విసరడం ప్రారంభించింది. దిక్కుతోచని విధంగా.. అడ్డదిడ్డంగా పరుగులు పెట్టింది. మైదానంలో ఉన్నవారు ఆందోళనకు గురయ్యారు. పరిస్థితిని అర్థం చేసుకుని, దానిని కంట్రోల్ చేసే వ్యక్తి పరుగెత్తుకుంటూ వచ్చి రోబోట్‌ను పట్టుకున్నాడు. ఆ తరువాత పరిస్థితి అదుపులోకి వచ్చింది. అయితే మైదానంలోని విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాలేదు.

### ఇదే మొదటిసారి కాదు

రోబోలు తడబడటం ఇదే మొదటిసారి కాదు. 2026 మార్చి నెలలో.. చైనాలోని షాన్సీ ప్రావిన్స్‌లో జరిగిన ఒక బహిరంగ నృత్య ప్రదర్శనలో, ఒక హ్యూమనాయిడ్ రోబోట్ ప్రమాదవశాత్తు ఒక చిన్న బాలుడి ముఖానికి తగిలింది. వెంటనే అప్రమత్తమైన.. సిబ్బంది ఆ రోబోను పక్కకు లాగడానికి ప్రయత్నించారు. అయినప్పటికీ.. అది రింగ్ మధ్యలో తన ప్రోగ్రామ్ ప్రదర్శించింది. రష్యా తయారు చేసిన రోబోట్ పేరు 'ఐడల్' . దీనిని 2025 నవంబర్ 10న మాస్కోలోని యారోవిట్ హాల్ కాంగ్రెస్ సెంటర్‌లో జరిగిన టెక్నాలజీ షోకేస్ సందర్భంగా ఆవిష్కరించారు. ప్రారంభంలో మెల్లగా అడుగులు వేసుకుంటూ వేదికపైకి వచ్చిన రోబోట్.. అక్కడున్నవారికి అభివాదం చేస్తున్నట్లు చెయ్యి పైకెత్తింది. ఆ తరువాత ఓ రెండడుగులు ముందుకు వేసి కిందకు పడిపోయింది. దీంతో అక్కడే ఉన్న సిబ్బంది దానిని పైకిలేపి కష్టం మీద తీసుకెళ్లారు. కానీ అనుకున్నదొకటి, అయినది ఒకటిగా జగడంతో.. కార్యక్రమం మధ్యలోనే నిలిచిపోయింది.

### కంపెనీలకు సూచనలు

రోబర్స్ తయారీ లేదా వినియోగం అనేది మంచి చర్య. అయితే వాటికి భావాలు అర్థం చేసుకోవడం, ప్రవర్తించిన విధానం పూర్తిగా తెలిసి ఉండదు. ఇలాంటి సమయంలో రోబోల వల్ల ప్రజలు కొన్ని సమస్యలు ఎదుర్కోవాలి వస్తుంది. కాబట్టి సంస్థలు దీనిని దృష్టిలో ఉంచుకుని రోబోట్స్ తయారు చేయాలి. అంతే కాకుండా..పూర్తిగా టెస్ట్ చేసిన తరువాత వినియోగానికి ఉపయోగించడం మంచిది. లేకుంటే.. ప్రజలకు ఇబ్బంది, తద్వారా కంపెనీ విమర్శలు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

# స్మార్ట్‌ఫోన్ తయారీలోకి ఓపెన్‌ఏఐ ఎంట్రీ?

## 2027 నాటికి ఏఐ ఏజెంట్ ఫోన్ విడుదల!



ప్రపంచవ్యాప్తంగా టెక్ విప్లవానికి నాంది పలికిన ఓపెన్‌ఏఐ సంస్థ ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లోకి ప్రవేశించనుందనే వార్తలొస్తున్నాయి. యాపిల్, శామ్‌సంగ్ వంటి దిగ్గజాలకు గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధమవుతున్న ఈ సంస్థ తన సరికొత్త ఏఐ ఏజెంట్ ఫోన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కేవలం యాప్‌ల మీద ఆధారపడకుండా కృత్రిమ మేధ ద్వారా నేరుగా పనులను పూర్తి చేసేలా ఈ ఫోన్‌ను రూపొందిస్తున్నట్లు తెలుస్తుంది. అయితే, ఈ అంశాలను అధికారికంగా కంపెనీ ఇంకా ధ్రువీకరించాల్సి ఉంది.

### ఏమిటీ ఏఐ ఏజెంట్ ఫోన్?

ప్రస్తుత స్మార్ట్‌ఫోన్‌ల్లో మనం ఒక పని కోసం వివిధ యాప్‌లను ఓపెన్ చేయాల్సి ఉంటుంది. కానీ, ఓపెన్‌ఏఐ అభివృద్ధి చేస్తున్న ఈ ఏజెంట్ ఫోన్ ఆ పద్ధతినే మార్చేయనుంది. ఇందులో యూజర్లు పనులను పూర్తి చేయడానికి ఏజెంట్ పైన ఆధారపడతారు. అంటే, ఫోన్‌లోని ఏఐ యూజర్ తరఫున వివిధ యాప్‌ల మధ్య నావిగేట్ చేస్తూ పనిని పూర్తి చేస్తుంది. ఈ టెక్నాలజీ భవిష్యత్తులో మొబైల్ వినియోగ విధానాన్ని పూర్తిగా మార్చనుంది.

### లీక్ అయిన స్పెసిఫికేషన్స్

ప్రముఖ టెక్ విశ్లేషకుడు మింగ్-చి కుయో వెల్లడించిన వివరాల ప్రకారం, 'ఈ స్మార్ట్‌ఫోన్ అత్యున్నత ప్రమాణాలతో రూపుదిద్దుకుంటోంది. అందుకోసం మీడియాటెక్ ప్రాసెసర్‌తో ఓపెన్‌ఏఐ భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇది డైమెన్సిటీ 9600 ప్రాసెసర్‌పై పనిచేయనుంది. టీఎస్ఎంసీ అధునాతన చీ2వా (2ఎఎ) నోడ్ సాంకేతికతతో ఈ చిప్ తయారవుతుంది. ఇందులో డ్యూయల్-ఎన్‌పీయూ ఆర్కిటెక్చర్ ఉంటుంది. ఇది సంక్లిష్టమైన ఏఐ గణనలను వేగంగా పూర్తి చేస్తుంది. వేగవంతమైన పనితీరు కోసం ఎల్‌పీడీడీఆర్6 ర్యామ్ యూఎఫ్ఎస్ 5.0 స్టోరేజ్ సాంకేతికతను వాడుతున్నారు. ఇన్-లైన్ హ్యాషింగ్ వంటి అత్యాధునిక భద్రతా ఫీచర్లు ఇందులో ఉంటాయి' అన్నారు.

### ఎందుకు ఈ ఫోన్ అవసరం?

ఓపెన్‌ఏఐ ఈ ఫోన్‌ను తీసుకురావడానికి రెండు ప్రధాన కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి.. వ్యాపార వ్యూహం. రాబోయే కాలంలో కంపెనీ ఐపీఓకు సిద్ధమవుతోంది. ఇన్వెస్టర్లను ఆకట్టుకోవడానికి బలమైన ప్రొడక్ట్ స్టోరీ అవసరం. రెండు.. మార్కెట్ ఆధిపత్యం. యాపిల్, గూగుల్, శామ్‌సంగ్ వంటి కంపెనీలు ఏఐ ఫీచర్లను తమ ఫోన్లలో వేగంగా ప్రవేశపెడుతున్నాయి. ఈ పోటీలో వెనుకబడకుండా ఉండాలంటే హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ రెండింటిపై నియంత్రణ ఉండాలని ఓపెన్‌ఏఐ భావిస్తోంది. ప్రస్తుత సమాచారం ప్రకారం, ఈ స్మార్ట్‌ఫోన్ 2027 మొదటి అర్ధభాగంలో భారీ ఉత్పత్తి దశలోకి వెళ్లనుంది. 2027-2028 మధ్య సుమారు 30 మిలియన్ల యూనిట్లను మార్కెట్లోకి విడుదల చేయాలని ఓపెన్‌ఏఐ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. కంపెనీ ఎగ్జిక్యూటివ్‌లు లేదా సామ్ ఆల్ట్‌మాన్ ఇప్పటివరకు ఈ ప్రాజెక్టును అధికారికంగా ధ్రువీకరించలేదు. ఏదేమైనా ఒక సాఫ్ట్‌వేర్ దిగ్గజం సొంత హార్డ్‌వేర్‌తో వస్తుందంటే అది మొబైల్ పరిశ్రమలో పెను సంచలనమే కానుంది. టెక్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ఏఐ ఏజెంట్ ఫోన్ స్మార్ట్‌ఫోన్ వినియోగంలో సరికొత్త శకానికి నాంది పలుకుతుందో లేదో చూడాలి.

# ఏఐ, డ్రోన్‌లో ముందుంటాం

**రాబోయే కాలంలో 30--50% వృద్ధి**
**రెవెన్యూ కూడా వెయ్యికోట్లు దాటాలని లక్ష్యిస్తున్నాం**
**స్టాఫింగ్, ఐటీ సేవల నుంచి ఏఐ వైపు అడుగులేస్తున్నాం**
**క్లౌడ్, ఏఐ సర్వేలెన్స్, డ్రోన్లలో కాంట్రాక్టులు దక్కాయి**
**రైల్వేతో పాటు బ్యాంకింగ్, డేటా సెంటర్లకూ సేవలు**



పేరు మాత్రమే కాదు. బిజినెస్ తీరునే మార్చుకుని ఆధునిక డ్రోన్, క్లౌడ్-- ఏఐ సర్వేలెన్స్ రంగాల్లో వడివడిగా అడుగులేస్తున్న మగెలానిక్ క్లౌడ్‌ది నిన్నటిదాకా స్టోరీనే. ఇపుడు ఆ స్టోరీ కార్యాచరణలోకి వస్తోంది. తాజాగా రైల్వే సహా పలు బ్యాంకింగ్ సంస్థల నుంచి సర్వేలెన్స్ కాంట్రాక్టులు దక్కించుకుంది. డ్రోన్ల తయారీలోకి ప్రవేశించాక డిఫెన్స్ నుంచీ కాంట్రాక్టులు దక్కాయి. తమ ప్రణాళికలు పూర్తిగా ఆచరణలోకి రావటానికి ఎక్కువ కాలం పట్టకపోవచ్చుంటున్న కంపెనీ సీఎండీ జోసెఫ్ సుదీర్(జో)తో 'సాక్షి' బిజినెస్ ప్రతినిధి ప్రత్యేకంగా మాట్లాడారు.

### మీ బిజినెస్ వర్టికల్స్‌లో ఆదాయం పరంగా ముందున్నవేంటి?

ఇప్పుడైతే స్టాఫింగ్, ఐటీ సేవలనేవి మొదటి వరుసలో నిలుస్తాయి. ఏఐ--ఇన్నోవేషన్‌పై ఫోకస్ చేస్తుంది. ఏఐ ఆధారిత అడ్వాన్స్‌డ్ సొల్యూషన్స్‌ను రూపొందిస్తున్నాం. రెవెన్యూ పరంగా దీనిదిపుడు రెండో స్థానం. డ్రోన్ తయారీలోకి కూడా ప్రవేశించాం. లాజిస్టిక్స్, డిఫెన్స్, కమర్షియల్ సర్వీసుల కోసం కస్టమైజ్డ్ డ్రోన్లను రూపొందిస్తున్నాం. ఇపుడైతే రెవెన్యూలో ఇది చివర్లో ఉంది. కానీ వచ్చే ఒకటి రెండేళ్లలో ఈ ఆర్డర్ పూర్తిగా మారుతుంది.

### మరి ఇలా మారటానికి ఇపుడేం చేస్తున్నారు?

ఇప్పుడున్న దశలో ఏది ఏ స్థాయిలో అమలవుతోందో పూర్తి వివరాలు చెప్పలేను. కానీ డైరెక్షన్ క్లియర్‌గా ఉంది. రెవెన్యూ పనితీరు మెరుగుపరుచుకోవటంపై ఫోకస్ పెట్టాం. గడిచిన మూడు త్రైమాసికాలుగా వృద్ధికి ఒక బేస్‌ను తయారు చేసుకున్నాం. నంబర్స్ మాత్రం ఇపుడు చెప్పలేను.

### సరే! ఇప్పుడు మీ డ్రోన్ బిజినెస్ ఏ స్థాయిలో ఉంది?

దీనికి సంబంధించి 15--20 కోట్ల ఆర్డర్‌బుక్ ఉంది. ప్రధానంగా లాజిస్టిక్స్ రంగానివే. డిజైన్ నుంచి ఏఐ ఇంటిగ్రేషన్, టెస్టింగ్, డిప్లాయిమెంట్ వరకూ మేమే చేస్తున్నాం. అవసరాన్ని బట్టి డెలివరీకి 30--45 రోజుల నుంచి మూడు నెలల వరకూ పడుతుంది.

### డ్రోన్ల తయారీలోకి చాలామంది వస్తున్నారు కదా!. మీ స్పెషాలిటీ ఏంటి?

మేం 200 కిలోల వరకూ పేలోడ్‌ను తీసుకెళ్లే సామర్థ్యం ఉన్న డ్రోన్లను తయారు చేస్తున్నాం. అవరోధాల్ని దాటుకుని ఆటో ల్యాండింగ్ కావటం... జీపీఎస్ లేకున్నా లక్ష్యాన్ని చేరటం... ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్‌ను తట్టుకోగలగటం ఈ డ్రోన్ల ప్రత్యేకత. సిగ్నల్ జామ్ అయిన సందర్భాల్లో సైతం ప్రత్యామ్నాయ కమ్యూనికేషన్ వ్యవస్థ, ఇంటర్నల్ నేవిగేషన్ వ్యవస్థల్ని ఉపయోగించుకుని పనిచేయటం వీటి స్పెషాలిటీ.

### మీ రెవెన్యూలో రికరింగ్ ఎక్కువా? లేకుంటే ప్రాజెక్ట్ బేస్డ్ ఎక్కువా?

దాదాపు 70--80 శాతం రెవెన్యూ రికరింగ్ రూపంలోనే వస్తోంది. ఇవన్నీ 3--5 ఏళ్ల దీర్ఘకాలిక కాంట్రాక్టులు. వీటివల్ల స్థిరత్వం వస్తోంది.

### మీ ఆర్డర్ బుక్, భవిష్యత్ వృద్ధిని వివరంగా చెబుతారా?

ఈ మధ్య మేం దాదాపుగా రూ.250 కోట్ల రైల్వే కాంట్రాక్టులు దక్కించుకున్నాం. వీటిలో 10 శాతాన్ని ఇప్పటిదాకా పూర్తిచేశాం. భవిష్యత్‌ను దీన్నిబట్టే ఊహించొచ్చు. ప్రస్తుత మార్గాల ద్వారా రెవెన్యూలో 20 శాతం వృద్ధి ఉండొచ్చని అంచనా వేస్తున్నాం.

### మీ బిజినెస్‌లో అంతర్జాతీయ వాటా ఎంత?

గతేడాది మేం రూ.600 కోట్ల రెవెన్యూ సాధించాం. దీన్లో రూ.400 కోట్లు అంతర్జాతీయ మార్కెట్ల నుంచే వచ్చింది. దీన్లో అత్యధికం అమెరికా నుంచే వచ్చింది. అంతర్జాతీయ క్లయింట్లలో డేటా సెంటర్లు ప్రధానం. వీటికి డేటా ఇంజినీరింగ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్లు అందిస్తున్నాం.

### మీ వ్యాపారంలో ఏఐ పాత్ర ఎంతవరకూ ఉంది?

అన్నిటికీ ఏఐనే ప్రధానం. ఉదాహరణకు.. బ్యాంకింగ్, ఏటీఎంలకు ఏఐ ఆధారిత వీడియో అనలిటిక్స్ అందిస్తున్నాం. ఆటోమేటెడ్ సర్వేలెన్స్ వ్యవస్థల్లో... రియల్‌టైమ్‌లో అలెర్ట్‌లు పంపటంలో... ఇంప్రూవ్‌మెంట్‌లో అన్నింట్లో ఏఐ ఉంటుంది. డ్రోన్స్, ఐటీ, సర్వేలెన్స్ ఇలా మా వెర్టికల్స్ అన్నింటా ఏఐ తప్పనిసరి.

### మీరు ఈ మధ్య కొన్ని కంపెనీల్ని టేకోవర్ చేశారు కదా? ఫండింగ్ ఎలా?

ఎక్కువ భాగం ఫండింగ్ అంతర్గత వనరుల నుంచే సమీకరించుకున్నాం. 2023--24లో మాత్రమే కొంత మూలధనం సమీకరించాం. మొత్తంగా చూస్తే బలమైన క్యాష్ ఫ్లో నుంచే ఫండింగ్ చేస్తున్నాం. ఇటీవల డ్రోన్లకు రూ.60 కోట్లు, రైల్వే ప్రాజెక్టులకు రూ.40 కోట్లు, బ్యాంకింగ్-- పీఎస్‌యూ ప్రాజెక్టుల కోసం రూ.100 కోట్లు కేటాయించాం.

### కంపెనీ వృద్ధికి సంబంధించి ఇన్వెస్టర్లు ఏం ఆశించొచ్చు?

గతేడాది 600 కోట్ల రెవెన్యూ ఉంది. ఈ ఏడాది రూ.850 కోట్లకు చేరుకోవచ్చు. వచ్చే ఏడాది వెయ్యి కోట్లు దాటాలని లక్ష్యిస్తున్నాం. రాబోయే సంవత్సరాల్లో 30--50 శాతం వృద్ధిని అంచనా వేస్తున్నాం. సేవల కంపెనీ నుంచి ప్లాట్‌ఫామ్ ఆధారిత, ఏఐ ఆధారిత వ్యాపారంగా ఎదుగుతున్నాం కనక ఇన్వెస్టర్లు కూడా మంచి వృద్ధిని ఆశించొచ్చు.


# ఏఐ ఉద్యోగాలను మింగేస్తుందా? సృష్టిస్తుందా?

ప్రస్తుత డిజిటల్ యుగంలో కృత్రిమ మేధ(ఏఐ)పై జరుగుతున్న చర్చ అంతా ఇంతా కాదు. ఒకవైపు టెక్నాలజీ వేగంగా విస్తరిస్తుంటే, మరోవైపు సామాన్యుల నుంచి నిపుణుల వరకు అందరిలోనూ ఒకటే ఆందోళన... 'ఏఐ వల్ల మన ఉద్యోగాలు పోతాయా?'. ఈ సందేహాలకు చెక్ పెడుతూ ప్రపంచ అగ్రగామి టెక్ దిగ్గజం ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ ఆసక్తికరమైన విశ్లేషణ చేశారు. 'ఏఐ ఉద్యోగాలను తొలగించదు, బదులుగా కొత్త ఉపాధి మార్గాలను సృష్టిస్తుంది' అని ఆయన స్పష్టం చేశారు.

### ఉద్యోగాల భయంపై హువాంగ్ స్పందన

మిల్కెన్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న హువాంగ్ ఏఐ వల్ల భారీగా ఉద్యోగ నష్టాలు సంభవిస్తాయనే వాదనలను కొట్టిపారేశారు. ఈ తరహా భయాందోళనలు కేవలం అపోహలని, ఇవి ప్రజలను సాంకేతికతకు దూరంగా ఉంచుతాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'ఏఐ కేవలం సాఫ్ట్‌వేర్ మాత్రమే కాదు, అదొక పారిశ్రామిక విప్లవానికి నాంది. డేటా సెంటర్లు,





అధునాతన హార్డ్‌వేర్, సహాయక ఎకోసిస్టమ్‌ల నిర్మాణం కోసం వేల సంఖ్యలో మానవ వనరుల అవసరం ఉంది. ఆటోమేషన్ అనేది మొత్తం ఉద్యోగాలను తుడిచిపెట్టదు. కేవలం పనితీరులోని నిర్దిష్టమైన, పునరావృతమయ్యే పనులను మాత్రమే మారుస్తుంది. అంటే, మనిషి చేసే మొత్తం పనిలో కొంత భాగాన్ని ఏఐ సాయంతో సులభతరం చేసుకునే అవకాశం ఉంటుందే తప్ప, మనిషి స్థానాన్ని పూర్తిగా భర్తీ చేయదు' అని చెప్పారు.

### ఆందోళనలు ఎందుకు? వాస్తవాలేంటి?

హువాంగ్ ఆశావాద దృక్పథాన్ని వ్యక్తపరిచినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక వేత్తలు మాత్రం హెచ్చరికలు జారీ చేస్తూనే ఉన్నారు. వివిధ కన్సల్టింగ్ సంస్థల అంచనాల ప్రకారం, రాబోయే ఐదేళ్లలో దాదాపు 15 శాతం ఉద్యోగ బాధ్యతల్లో మార్పులు లేదా కొన్ని పాత తరహా పాత్రలు కనుమరుగయ్యే అవకాశం ఉందని గణాంకాలు హెచ్చరిస్తున్నాయి. వేగవంతమైన ఏఐ స్వీకరణ వల్ల ఆర్థిక అసమానతలు పెరిగే ప్రమాదం ఉందని, సరైన శిక్షణ లేని వారు ఉపాధి కోల్పోయే అవకాశం ఉందనేది నిపుణుల ప్రధాన ఆందోళన.

### భయం వద్దు.. నైపుణ్యం ముద్దు!

ప్రతి సాంకేతిక మార్పు వెనుక కొంత అనిశ్చితి ఉండటం సహజం. అయితే, టెక్ పరిశ్రమ సృష్టిస్తున్న హైప్‌కు భయపడి పురోగతిని ఆపడం సరికాదని హువాంగ్ సూచిస్తున్నారు. ఏఐని ఒక ముప్పుగా చూడటం కంటే.. మన సామర్థ్యాన్ని పెంచే సాధనంగా చూడాలి అనేది ఆయన మాటల సారాంశం. మొత్తానికి ఏఐ ప్రభావం వల్ల ఉద్యోగ స్వరూపం మారుతుందనేది వాస్తవం. అయితే, కాలంతో పాటు కొత్త నైపుణ్యాలను సంతరించుకునే వారికి ఏఐ ఒక వరం కానుంది. సాంకేతికత పట్ల భయాన్ని వీడి దానిని వాడుకోవడంలోనే భవిష్యత్తు ఉందనేది స్పష్టమవుతోంది.

# బ్లాక్ శారీలో సన్నని న డుము.. అందాల జ్యోతి స్టన్నింగ్ లుక్





**గ్లామర్ వరల్డ్ లో ఎంతోమంది అప్సరసల నడుమ పోటీని తట్టుకోవడం అంత చిన్న విషయం కాదు.**


గ్లామర్ వరల్డ్ లో ఎంతోమంది అప్సరసల నడుమ పోటీని తట్టుకోవడం అంత చిన్న విషయం కాదు. ఇక వారిలో ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జ్యోతి పూర్వాజ్, తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. బ్లాక్ ట్రాన్స్‌పరెంట్ శారీలో ఆమె కనిపిస్తున్న తీరు చూస్తుంటే, ట్రెడిషనల్ వేర్‌లో కూడా గ్లామర్‌ను ఎలా ఎలివేట్ చేయాలో ఆమెకు బాగా తెలుసనిపిస్తోంది. అతిగా చేయకుండా, కేవలం తన చూపులతోనే కుర్రకారును ఆకట్టుకుంటోంది. ఈ లేటెస్ట్ ఫోటోషూట్ ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఈ ఫోటోల్లో జ్యోతి తన నేచురల్ బ్యూటీని చాలా చక్కగా ప్రజెంట్ చేసింది. విరబోసిన జుట్టు, సింపుల్ మేకప్, మెడపై ఉన్న చిన్న టాటూ ఆమె లుక్‌కు ఒక మోడ్రన్ టచ్ ఇచ్చాయి. ముఖ్యంగా కెమెరా వైపు చూస్తూ ఆమె ఇస్తున్న స్మైల్ ఫోటోలకు మరింత అందాన్ని తీసుకొచ్చింది. నేటి జనరేషన్ ఫ్యాషన్ ట్రెండ్స్‌ను ఫాలో అవుతూనే, శారీ కట్టులో ఉండే ఆ హుందాతనాన్ని ఎక్కడా తగ్గకుండా చూసుకుంది. డీసెంట్ అప్పీల్‌తోనే గ్లామర్ డోస్ పెంచవచ్చని ఈ క్లిక్స్‌తో నిరూపించింది. జ్యోతి పూర్వాజ్ కెరీర్ విషయానికి వస్తే, ఆమె ప్రయాణం చాలా బలన్స్ గా సాగుతోంది.

బుల్లితెరపై నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఆ తర్వాత వెండితెరపై కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ తన నటనతో ఆడియన్స్‌ను అలరిస్తోంది. కేవలం గ్లామర్ రోల్స్ మాత్రమే కాకుండా, పెర్ఫార్మెన్స్‌కు స్కోప్ ఉన్న పాత్రలు చేయడానికే ఆమె ప్రాధాన్యత ఇస్తోంది దస్ట్రీలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా, తనకంటూ ఒక ఇమేజ్‌ను క్రియేట్ చేసుకోవడంలో ఆమె సక్సెస్ అయింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో జ్యోతికి మిలియన్ల కొద్దీ ఫాలోయింగ్ ఉంది. ఆమె షేర్ చేసే ప్రతి ఫోటో కూడా సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. నటిగానే కాకుండా ఒక ఫ్యాషన్ ఐకాన్‌గా కూడా ఆమె ఎదుగుతోంది. ఫిట్‌నెస్ విషయంలో ఆమె తీసుకుంటున్న జాగ్రత్తలు ఈ లేటెస్ట్ ఫోటోషూట్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. తన లుక్స్‌తో ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని చూపిస్తూ ఫ్యాన్స్‌ను థ్రిల్ చేస్తోంది. ముఖ్యంగా యువతలో ఆమెకు ఉన్న క్రేజ్ ఈ మధ్య కాలంలో బాగా పెరిగింది. మరి అమ్మడు ఈ గ్లామర్ తో ఎలాంటి ఆఫర్లు అందుకుంటుందో చూడాలి.

# ఆ బయోపిక్ లో సాయి పల్లవి తప్ప మరో ఆప్షనే లేదట!



భారతీయ సంగీత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన గాన కోకిల ఎం.ఎస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌పై ఇండస్ట్రీలో మళ్లీ చర్చలు వేడెక్కుతున్నాయి. ముఖ్యంగా ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా సాయి పల్లవిని ఫైనల్ చేసినట్టు వస్తున్న సమాచారం ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. మధ్యలో పలు పేర్లు వినిపించినప్పటికీ, మేకర్స్ మాత్రం సాయి పల్లవిని తప్ప మరెవరినీ ఈ పాత్ర కోసం పరిగణనలోకి తీసుకోవడంలేదని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాతలు బన్నీ వాస్, రాక్‌లైన్ వెంకటేష్ సంయుక్తంగా నిర్మించనున్నారని సమాచారం. ఇటీవల ఈ బయోపిక్ నుంచి సాయి పల్లవి తప్పుకుందనే వార్తలు, అలాగే ఆమె స్థానంలో రుక్మిణి వసంత్‌ను తీసుకున్నారనే ప్రచారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. అయితే ఈ వార్తలన్నింటినీ మేకర్స్ పూర్తిగా ఖండించినట్టు తెలుస్తోంది. ఎం.ఎస్ సుబ్బులక్ష్మి లాంటి గొప్ప వ్యక్తిత్వాన్ని తెరపై ప్రతిబింబించాలంటే సాయి పల్లవి లాంటి నటి అవసరమని టీమ్ గట్టిగా నమ్ముతోందట. ఆమె నటనలో ఉన్న సహజత్వం, క్లాసికల్ లుక్, డెడికేషన్ లాంటి క్వాలిటీస్ ఆమెను ప్రత్యేకంగా నిలబెడతాయని భావిస్తున్నారు. అందుకే ఈ ప్రాజెక్ట్‌లో ఆమెనే కొనసాగిస్తున్నామని స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా అక్టోబర్ 2026 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని తెలుస్తోంది. మొదట ఈ సినిమా త్వరగా స్టార్ట్ అవుతుందని భావించినప్పటికీ, సాయి పల్లవి ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉండటం వల్ల షూటింగ్ షెడ్యూల్‌ను వాయిదా వేసినట్టు టాక్ వినిపిస్తోంది. ఇదే సమయంలో, ఈ పాత్ర కోసం సాయి పల్లవి ప్రత్యేకంగా కర్ణాటక సంగీతంలో శిక్షణ తీసుకుంటోందన్న సమాచారం కూడా సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా అక్టోబర్ 2026 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని తెలుస్తోంది. మొదట ఈ సినిమా త్వరగా స్టార్ట్ అవుతుందని భావించినప్పటికీ, సాయి పల్లవి ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉండటం వల్ల షూటింగ్ షెడ్యూల్‌ను వాయిదా వేసినట్టు టాక్ వినిపిస్తోంది. ఈ పాత్ర కోసం సాయి పల్లవి ప్రత్యేకంగా కర్ణాటక సంగీతంలో శిక్షణ తీసుకుంటోందన్న సమాచారం కూడా సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి ఈ బయోపిక్‌ను తెరకెక్కించనుండటం ఈ ప్రాజెక్ట్‌కు మరో బలంగా మారింది. జెర్సీ వంటి భావోద్వేగభరితమైన సినిమాతో తన కథన శైలిని నిరూపించుకున్న ఆయన, ఎం.ఎస్ సుబ్బులక్ష్మి జీవితాన్ని కూడా అదే స్థాయిలో ఎమోషనల్ గా, నిజాయితీగా చూపిస్తాడనే నమ్మకం ప్రేక్షకుల్లో ఉంది. ఇక సంగీత దర్శకుడు అనిరుధ్ ఈ సినిమాకు సంగీతం అందించనుండటం కూడా ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఒక గొప్ప సంగీత విద్వాంసురాలి జీవితం నేపథ్యంలో తెరకెక్కుతున్న సినిమా కావడంతో మ్యూజిక్ ఈ ప్రాజెక్ట్‌లో కీలక పాత్ర పోషించనుంది. మొత్తానికి, సాయి పల్లవి లాంటి ప్రతిభావంతమైన నటి ఈ బయోపిక్‌లో ప్రధాన పాత్ర పోషించడం, గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం, అనిరుధ్ సంగీతం ఇవన్నీ కలిసివచ్చి ఈ ప్రాజెక్ట్‌ను అత్యంత ఆసక్తికరంగా మార్చుతున్నాయి. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, త్వరలోనే మేకర్స్ నుంచి క్లారిటీ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# వారణాసి తర్వాత మహేష్ ప్లాన్ అదే!



**ఇదిలా ఉంటే వారణాసి తర్వాత మహేష్ బాబు ప్లాన్స్ మరింత యాంబీషస్‌గా కనిపిస్తున్నాయి.**

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు కెరీర్‌లో కీలక మలుపు తిరిగే ప్రాజెక్ట్‌గా వారణాసి నిలవబోతోందనే అంచనాలు ఇండస్ట్రీలో బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు పూర్తి స్థాయి పాన్ ఇండియా మార్కెట్‌ను టార్గెట్ చేయని మహేష్, ఈ సినిమాతో తన ఇమేజ్‌ను నేషనల్ నుంచి గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లాలని చూస్తున్నారు. ముఖ్యంగా రాజమౌళి దర్శకత్వం ఈ ప్రాజెక్ట్‌కు భారీ క్రేజ్‌ను తెచ్చిపెడుతోంది. రాజమౌళి సినిమాలకు ఉన్న అంతర్జాతీయ గుర్తింపు దృష్ట్యా, వారణాసి మహేష్ బాబుకు కేవలం సినిమా కాకుండా ఒక కెరీర్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్ట్‌గా మారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. స్టార్ హీరో సంచలన నిర్ణయం! గుంటూరు కారం తర్వాత మూడేళ్ల గ్యాప్ అయితే ఈ జర్నీలో మహేష్ కెరీర్లో మూడేళ్ల గ్యాప్ వచ్చింది. గుంటూరు కారం తర్వాత మహేష్ నుంచి ఇంత పెద్ద గ్యాప్ తీసుకోవడం రిస్క్‌గా కనిపించినా, తర్వాత వస్తుంది రాజమౌళి సినిమా కాబట్టి అది తన మార్కెట్ ను, క్రేజ్ ను, ఫాలోయింగ్ ను పెంచుతుందే తప్పించి ఏ మాత్రం రిస్క్ అనుకోవడానికి లేదు. రాజమౌళి ప్రాజెక్ట్స్‌కు సహజంగానే ఎక్కువ సమయం పడుతుండటంతో, ఈ గ్యాప్‌ను ఫ్యాన్స్ కూడా అంగీకరిస్తున్నారు. అంతేకాదు, సినిమా రిలీజ్ అయ్యే సమయానికి ఈ వెయిటింగ్ పీరియడ్ మరింత ఎక్స్‌పెక్టేషన్స్‌ను పెంచే ఫ్యాక్టర్‌గా మారవచ్చు. ాాఁజవతీఅంవఎవత్ మూడేళ్లలో మూడు సినిమాలు ఇదిలా ఉంటే వారణాసి తర్వాత మహేష్ బాబు ప్లాన్స్ మరింత యాంబీషస్‌గా కనిపిస్తున్నాయి. మూడేళ్లలో మూడు సినిమాలు రిలీజ్ చేయాలనే టార్గెట్ తో ఆయన ముందుకెళ్తున్నట్టు టాక్. ఇది కేవలం బిజీ షెడ్యూల్ మాత్రమే కాకుండా, మార్కెట్‌ను నిరంతరం యాక్టివ్‌గా ఉంచే వ్యూహంగా భావిస్తున్నారు. వారణాసి తర్వాత మహేష్ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ లో ఓ ప్రాజెక్ట్, అలాగే ఏషియన్ సునీల్ తో మరో సినిమా చర్చల్లో ఉండటం గమనార్హం. ఒకేసారి పలు ప్రాజెక్టులను ప్లాన్ చేయడం ద్వారా గ్యాప్‌లను తగ్గించడమే కాకుండా, విభిన్న జానర్లతో ఆడియన్స్‌ను ఆకట్టుకోవాలని మహేష్ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ఈ ప్రాజెక్టులకు ఎవరు దర్శకత్వం వహిస్తారనేది ఇంకా ఫైనల్ కాకపోవడం ఆసక్తిని పెంచుతోంది. – రూ.3000 కోట్ల డైరెక్టర్‌పై కన్నేసిన టాలీవుడ్ హీరో డిమాండ్ ఇక రెమ్యునరేషన్ అంశం కూడా ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. వారణాసి తర్వాత పెరిగే మార్కెట్ ను దృష్టిలో ఉంచుకుని ఆయన భారీ పారితోషికం డిమాండ్ చేస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. వారణాసి సక్సెస్ అయితే, ఆయన మార్కెట్ విలువ భారీగా పెరిగే అవకాశం ఉండటంతో, ఈ హైక్ నిర్మాతలపై బడ్జెట్ ప్రెజర్‌ను పెంచే అవకాశముంది. ఇదే సమయంలో, స్టార్ మార్కెట్ పెరిగితే రికవరీ కూడా అదే స్థాయిలో ఉండే అవకాశం ఉండటంతో, నిర్మాతలు కూడా ఈ రిస్క్‌ను అంగీకరించడానికి అవకాశాలున్నాయి. . ఒక్కసారే భోజనం అయితే ఈ మొత్తం ప్లాన్‌లో అత్యంత కీలకమైంది రాజమౌళితో సినిమా చేసిన తర్వాత వచ్చే ప్రాజెక్టులపై భారీ అంచనాలు ఏర్పడటం సహజం. గతంలో పలువురు స్టార్ హీరోలు ఈ ప్రెజర్‌ను ఫేస్ చేసినప్పటికీ, వాళ్లలో ఎక్కువ మంది ఫ్లాపులనే ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో మహేష్ తర్వాతి ప్రాజెక్టులు, వాటి ఎంపికపై మరింత జాగ్రత్త వహించాల్సిన అవసరముందని అంతా అభిప్రాయపడుతున్నారు. మరో వైపు మార్కెట్ ఎక్స్‌పాన్షన్ విషయంలో కూడా మహేష్ బాబు స్పష్టమైన వ్యూహంతో ముందుకెళ్తున్నట్టు తెలుస్తోంది. వారణాసి తర్వాత నార్త్ ఇండియా మరియు ఓవర్సీస్ మార్కెట్లపై ఫోకస్ పెంచే అవకాశం ఉంది. రాజమౌళి బ్రాండ్ వల్ల వచ్చే విజిబిలిటీని ఉపయోగించుకుని, తన తర్వాతి సినిమాలను కూడా పాన్ ఇండియా లెవల్‌లో ప్లాన్ చేసే అవకాశమున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా చూస్తే, వారణాసి మహేష్ బాబు కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలవడమే కాకుండా, ఆయన భవిష్యత్ దిశను నిర్ణయించే కీలక ప్రాజెక్ట్‌గా మారనుంది.


# ‘మైసా’ కోసం రష్మిక రిస్క్.. 80 అడుగుల ఎత్తు నుంచి జంప్






పాత్ర కోసం ఎంత రిస్క్ అయినా తీసుకునే కథానాయికల్లో రష్మిక ముందు వరుసలో ఉంటారు. తాజాగా ఆమె మరోసారి నటనపై తనకున్న నిబద్ధతను చాటుకున్నారు. తాను నటిస్తోన్న ‘మైసా’ కోసం మునుపెన్నడూ లేనివిధంగా కష్టపడుతున్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో రష్మిక గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం ఆమె చేసిన సవాలుతో కూడిన స్టంట్స్ గురించి ‘మైసా’ డైరెక్టర్ రవీంద్ర పుల్లె తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. “రష్మిక పోషిస్తున్న పాత్ర పేరు ‘మైసా’. చాలా ప్రభావవంతమైన పాత్ర. ఆమె ప్రదర్శించే కోపం, ఆవేశం ఈ సినిమాకు హైలైట్. ఇటీవలే కేరళలోని అతిరపల్లి జలపాతం వద్ద ఒక క్లిష్టమైన యాక్షన్ సీన్ చిత్రీకరించాం. రష్మిక డూప్ లేకుండా 80 అడుగుల ఎత్తు నుంచి దూకారు. ఆ సమయంలో ఆమె చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి. అయినా విరామం తీసుకోకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు. ఆమె నిబద్ధత చూసి చిత్రబృందమంతా ఆశ్చర్యపోయింది” అని తెలిపారు. ఈ చిత్రం కోసం అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్ కెచా ఖంపక్డీ ఆధ్వర్యంలో రష్మిక శిక్షణ పొందినట్లు డైరెక్టర్ వెల్లడించారు. బ్యాంకాక్‌లో వారం రోజుల పాటు ప్రతిరోజూ 8 గంటల పాటు కఠినమైన యుద్ధ విద్యలను నేర్చుకున్నట్లు తెలిపారు. మార్షల్ ఆర్ట్స్, గిరిజన పోరాట పద్ధతులను కలిపి ఈ సినిమా కోసం ఓ కొత్తతరహా యాక్షన్ శైలిని డిజైన్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# అల్లరి నరేష్ ఫిట్‌నెస్ సీక్రెట్.. ఒక్కసారే భోజనం



**టాలీవుడ్ సీనియర్ హీరో అల్లరి నరేష్ తన కామెడీతోనే కాదు, తన లీన్ ఫిజిక్‌తోనూ అందరినీ ఆశ్చర్యపరుస్తుంటారు.**

టాలీవుడ్ సీనియర్ హీరో అల్లరి నరేష్ తన కామెడీతోనే కాదు, తన లీన్ ఫిజిక్‌తోనూ అందరినీ ఆశ్చర్యపరుస్తుంటారు. ఇన్నేళ్లయినా ఆయన బాడీ షేప్ ఏమాత్రం మారకపోవడం వెనుక ఒక కఠినమైన డైట్ ప్లాన్ ఉంది. రోజుకు కేవలం ఒక్క పూట మాత్రమే భోజనం చేసే పద్ధతిని ఆయన పాటిస్తున్నారు. ఆహారంపై పెద్దగా ఆకర్షణ లేకపోవడమే తన ఫిట్‌నెస్ రహస్యమని, లీన్ బాడీని మెయింటైన్ చేయడం కోసమే ఈ క్రమశిక్షణతో ఉన్నానని ఆయన వెల్లడించారు. ఆ వివరాలు చూద్దాం.. స్టార్ హీరో సంచలన నిర్ణయం! రోజుకు ఒక్క పూటే భోజనం: అల్లరి నరేష్ ఫిట్‌నెస్ విషయంలో చాలా స్ట్రిక్ట్. ఆయన రోజుకు ఒకేసారి హుందాగా భోజనం చేస్తారు. అంటే మధ్యాహ్నం లంచ్ చేస్తే, రాత్రి డిన్నర్ చేయరు. ఒకవేళ రాత్రికి ప్లాన్ ఉంటే మధ్యాహ్నం స్కిప్ చేస్తారు. ఇలా చేయడం వల్ల బాడీలో అనవసరమైన ఫ్యాట్ చేరకుండా ఉంటుందని ఆయన నమ్ముతారు. దాదాపు 90 శాతం సమయం ఆయన ఇదే పద్ధతిని ఫాలో అవుతూ తన బరువును అదుపులో ఉంచుకుంటారు. జ్యూస్‌లకు, కొబ్బరి నీళ్లకు దూరం చాలామంది ఫిట్‌నెస్ కోసం జ్యూస్‌లు, కొబ్బరి నీళ్ల వంటివి ఎక్కువగా తీసుకుంటుంటారు. కానీ నరేష్ మాత్రం వీటికి దూరంగా ఉంటారట. ఆయనకు ఆహారం పట్ల అంతగా క్రేజ్ లేకపోవడం కూడా ఒక ప్లస్ పాయింట్ అని చెప్పాలి. కేవలం తనకు అవసరమైన పోషకాలు అందేలా ఒకే పూట తింటూ, మిగతా సమయమంతా చాలా తక్కువ క్యాలరీలతో సరిపెట్టుకుంటారు. దీనివల్ల ఆయన ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటారు. వర్కౌట్స్ అంటే ఇలా ఉండాలి: కేవలం డైట్ మాత్రమే కాదు, వర్కౌట్స్ విషయంలోనూ నరేష్ తనదైన స్టైల్ ఫాలో అవుతారు. సిక్స్ ప్యాక్ లేదా పర్ఫెక్ట్ బాడీ షేప్ కోసం ర్యాంకింగ్ లెగ్ రైజెస్, బ్యాక్ ఎక్స్‌టెన్షన్స్ వంటి వ్యాయామాలు చేస్తారు. కండలు పెంచి బాడీని బల్క్ చేయకుండా, ఎప్పుడూ లీన్ గా ఉండటానికే ఆయన ప్రాధాన్యత ఇస్తారు. అందుకే ఆయన ఏ రోల్‌లో నటించినా ఆ పాత్రకు త్వరగా సెట్ అయిపోతారు. వరుస సినిమాలతో బిజీ: నరేష్ ప్రస్తుతం కెరీర్ పరంగా ఫుల్ జోష్‌లో ఉన్నారు. ప్రదీప్ మద్దాలి దర్శకత్వంలో “కనక దుర్గ” అనే డివోషనల్ యాక్షన్ డ్రామాలో నటిస్తున్నారు. ఇది కాకుండా, మే 29న “ఆల్కహాల్” అనే సినిమాతో మన ముందుకు రాబోతున్నారు. ఇందులో రుహానీ శర్మ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఒక నటుడిగా నిలదొక్కుకోవాలంటే టాలెంట్‌తో పాటు ఫిట్‌నెస్ కూడా చాలా ముఖ్యం. అల్లరి నరేష్ పాటిస్తున్న ఈ ‘వన్ మీల్ ఏ డే’ పద్ధతి అందరికీ సాధ్యం కాకపోయినా, ఆయన చూపిస్తున్న క్రమశిక్షణ మాత్రం అభినందనీయం. కంటెంట్ ఉన్న కథలను ఎంచుకుంటూనే, తన హెల్త్ విషయంలో ఇంత కేర్ తీసుకోవడం వల్లే ఆయన సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ అదరగొడుతున్నారు. ఇక మరి ఆయన రాబోయే సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటాయో చూడాలి!

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -“APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,“D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .